నేటి కందం-నేటికి అందం

చిత్రముగ ఏపేవతమిళ నాడే"
"కృత్రిమ మేధస్సు"తోడ కీర్తింప బడన్
మిత్రుండు "విజయ్"నూతన
"ఛత్రము" నిడి నాడు జనులు సంతస మొందన్

(తమిళ నాడు ముఖ్యమంత్రి విజయ్ కృత్రిమ మేధస్సు కొరకు ఏకంగా ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం ప్రజలకు ఆనందం కలిగించింది? దేశంలోనే ఇది రెండవది (మొదటిది కేరళం)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

కాక్రోచ్ జనతా పార్టీ
కమలానికి కలవరింతే
పెనుమార్పు సునామీలా
పెరిగిపోతే ఒక చింతే.
ఆన్ లైన్ జెన్ జెడ్
అసంతృప్తి మాధ్యమం
అనుకుంటే పొరపాటే
అవుతుంది ఉద్యమం

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 26-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/95 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:226 పేజిలు:6 వెల: రూ.1/-


# ఎరువుల ధరలు ఊహించని రీతిలో పెరిగాయి

## – కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, మే 25: ఫెర్టిలైజర్ల ధరలు అనూహ్య రీతిలో పెరిగినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఫ్యూయల్, ఫెర్టిలైజర్, ఫోరెక్స్.. ఈ మూడింటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల వల్ల. ప్రపంచ మార్కెట్లు కుదేలవుతున్నాయని, దేశంలో అన్నింటిపై వ్యయం పెరిగినట్లు ఆమె చెప్పారు. ముంబైలో జరిగిన స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన 37వ వార్షికోత్సం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవాలని ఇటీవల ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును ఆమె గుర్తు చేశారు. అది చాలా ముఖ్యమైందని, మూడు ఎఫ్‌లపై ఫోకస్ చేయాలని, ఫ్యూయల్.. ఫెర్టిలైజర్, ఫోరెక్స్ పై దృష్టి పెట్టాలని ఆమె అన్నారు. గడిచిన 10 రోజుల్లోనే నాలుగు సార్లు ఇంధనం ధరలు పెరిగాయి. ముడి చమురు ధర పెరగడం పెద్ద సవాల్‌గా మారిందన్నారు. ఇంధనంతో పాటు ఫెర్టిలైజర్ల ధర అమాంతంగా పెరిగినట్లు ఆమె తెలిపారు. వీటితో పాటు పెరిగిన బంగారం ధరలు కూడా కొన్ని సవాళ్లను సృష్టిస్తున్నట్లు ఆమె అన్నారు.

పశ్చిమాసియా సంక్షోభం ఓ దౌత్యపరమైన లేక రాజకీయ్ఃపరమైన సమస్య కాదు అని మంత్రి తెలిపారు. ఆ సంక్షోభం వల్ల వ్యాపారవేత్తలు, సాధారణ ప్రజలు ఇబ్బందిపడుతున్నట్లు చెప్పారు. ఇంధన ధరలు పెరిగాయని, కార్గో ఆలస్యం అవుతోందని, షిప్పింగ్ ఖర్చు పెరిగిందని, ఇన్‌పుట్స్ తగ్గాయని, పెట్టుబడిపై వత్తిడి పెరిగిందని, ఎగుమతి ఆదేశాలపై అనిశ్చితి నెలకొన్నట్లు మంత్రి తెలిపారు. అన్ని ఒకేసారి జరగడం వల్ల ఆ ప్రభావం తీవ్రంగా ఉన్నట్లు ఆమె చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి ప్రస్తుతం పాజిటివ్ ఉందని ఆమె అన్నారు. కానీ కొందరు ఎప్పుడూ నెగటివ్‌గా మాట్లాడుతారని విమర్శించారు. తమ ప్రభుత్వం సాధించిన ఘనతలను హేళన చేస్తున్నా రన్నారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని, సుమారు లక్ష కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉన్నట్లు మంత్రి సీతారామన్ తెలిపారు.

# కేంద్రం సహకరించకున్నా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, మే 25:కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం నష్టాలను భరించేందుకైనా వెనుకాడదని స్పష్టం చేశారు.

ఈసారి మొక్కజొన్న దిగుబడి బాగా వచ్చింది. కానీ కేంద్ర ప్రభుత్వం ఆ పంటను సేకరించడం లేదు. దీంతో ప్రభుత్వానికి నష్టం వచ్చినా రైతులను ఆదుకునేందుకు మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నామని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

ఇవాళ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో సీపీఎం నేతల బృందం సీఎం రేవంత్ రెడ్డిని కలిసింది. రైతుల సమస్యలు, ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయ అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం.

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్, మే 25: హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. బంజారాహిల్స్, ఖైరతాబాద్, పంజగుట్ట,ఇబ్రహీంపట్నం, అల్వాల్, ఎల్‌బీనగర్, ఉప్పల్, మోహిదీపట్నం ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఎండ తీవ్రత, ఉక్కపోతకు గురవుతున్న నగరవాసులకు ఈ చిరుజల్లులు ఎంతో ఉపశమనాన్నిచ్చాయి.

అలాగే వాతావరణ శాఖ లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం.. నల్గొండ, వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలు కురిసే సమయం ప్రజలు చెట్ల కింద ఉండొద్దని అధికారులు సూచించారు.

# రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా పద్మ అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ, మే 25:భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో సోమవారం పద్మ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. దేశంలోని వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు భారత ప్రభుత్వం.. దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీలను ప్రదానం చేసింది. ఈ ఏడాది మొత్తం 131 మందికి ఈ పురస్కారం దక్కగా.. వారిలో ఐదుగురు పద్మవిభూషణ్, 13 మంది పద్మభూషణ్, 113 మంది పద్మశ్రీలకు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఈ పురస్కారాల్ని అందుకోవడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తోంది. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన ప్రముఖ వైద్యుడు జి.వెంకట్రావుకు, క్యాన్సర్ వైద్య సేవల్లో విశేష కృషి చేసిన డాక్టర్ పి.విజయ్ ఆనంద్ రెడ్డికి పద్మ గౌరవం లభించింది. అలాగే కూచిపూడి నృత్యకారిణి దీపికా రెడ్డికి పద్మ అవార్డు దక్కింది. అవార్డు గ్రహీతలను రాష్ట్రపతి అభినందిస్తూ.. దేశాభివృద్ధికి వివిధ రంగాల్లో వారు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ దుర్మార్గమైన విధానాలతో రైతాంగం కష్టాల్లో ఉన్నారు: మంత్రి తుమ్మల



ఖమ్మం, మే 25:దేశంలో అన్నిరకాల పంటలను తమ ప్రభుత్వం మాత్రమే కొనుగోలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వరిధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమేనని ధ్వజమెత్తారు. ఇప్పుడు సిగ్గులేకుండా బీజేపీ నేతలు బస్సుయాత్రలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కనీసం గన్నీ బ్యాగులు తీసుకురా లేని పరిస్థితి ఉందని అన్నారు. కేంద్రప్రభుత్వ దుర్మార్గమైన విధానాల కారణంగానే రైతాంగం కష్టాల్లో ఉన్నారని తెలిపారు. కనీసం డీజిల్ ఇవ్వకపోవటంతో ఎక్కడికక్కడా ధాన్యం రవాణా ఆగిపోయిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ధ్వజమెత్తారు. పలు సంస్థలను నిర్వీర్యం చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణలో 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. ఇంకా కొంటామని స్పష్టం చేశారు. ఈరోజు (సోమవారం) యాతాలకుంట టన్నెల్‌ను మంత్రి పరిశీలించారు. యాతాలకుంట టన్నెల్ వద్ద అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు.

ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందాలనేది తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఎక్కువ అని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు గోదావరి ఆయకట్టు దక్కలేదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చివరి ప్రాంతమైన ఖమ్మానికి గోదావరి జలాలు అందలేదని ప్రస్తావించారు. ఎక్కువ భూభాగం ఎన్నెస్పీ కెనాల్ పైభాగం.. కింద భాగంలో గోదావరి ఉండటంతో నీరు అందలేదని అన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసి.. అప్పటి ముఖ్యమంత్రిని.. ఖమ్మానికి గోదావరి జలాలు అందించాలని కోరానని ప్రస్తావించారు. నల్గొండ ఫ్లోరైడ్ పీడిత ప్రాంతానికి మాజీ సీఎం ఎన్టీఆర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అవకాశం ఇచ్చారని తెలిపారు. గోదావరిపై మొట్టమొదట దేవాదుల ప్రారంభించామని చెప్పుకొచ్చారు.

**1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చాం..**


గోదావరిపై ఎత్తిపోతల పథకాలకు తప్ప మరో అవకాశం లేదని మంత్రి తుమ్మల తెలిపారు. గోదావరిపై 1998లో దుమ్ముగూడెం ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. ఆనాడు దుమ్ముగూడెం వద్ద రాజీవ్ సాగర్ - ఇందిరా సాగర్ వరకు ప్రారంభించిన పంపులు మోటార్లకే పరిమితమయ్యాయని అన్నారు. దుమ్ముగూడెం శ్రీరామచంద్రుడు నడయాడిన ప్రాతంలో సీతారామ ప్రారంభించామని చెప్పుకొచ్చారు. ఆ ప్రభుత్వంలో కేవలం పంప్‌హౌస్ నిర్మాణ పనులకే పరిమితవయ్యాయని అన్నారు. యాతాలకుంట టన్నెల్ ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు నీరు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు.

కేసీఆర్ హయాంలో ఈ టన్నెల్ పూర్తి చేయడానికి కూడా నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల అన్నారు. ఇది తన జీవిత ఆశయమని.. లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానని ప్రస్తావించారు. రేవంత్‌రెడ్డి మొదటిసారి రాజీవ్ లింక్ కెనాల్‌కు అనుమతి ఇచ్చారని అన్నారు. ఆరునెలల్లో రాజీవ్ లింక్ కెనాల్ పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాతాలకుంట టన్నెల్‌కు అనుమతి ఇచ్చారని వెల్లడించారు. 15 నెలల్లో రెండు కిలోమీటర్ల పొడవు టన్నెల్ నిర్మాణం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

**అధికారులను అభినందించిన మంత్రి తుమ్మల..**

యాతాలకుంట టన్నెల్ పనులు చేపట్టిన ఏజెన్సీ, అధికారులను మంత్రి తుమ్మల అభినందించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని.. ఇది తన రాజకీయ కోరిక అని వ్యాఖ్యానించారు. తనను ఆశీర్వదించిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నదే తన ఆశయమని ఉద్ఘాటించారు. ఆగష్టు 15వ తేదీలోగా లైనింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. 35 సంవత్సరాల క్రితమే డొక్కా సీతమ్మ అక్విడెక్ట్ కట్టామని ప్రస్తావించారు. రైతుల త్యాగానికి ఫలితంగా నష్టపరిహారం ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించానని తెలిపారు. అటు సాగర్ ఆయకట్టు.. ఇటు సీతారామ ఆయకట్టుతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కృష్ణా గోదావరి జలాలతో సస్యశ్యామలం కాబోతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# భారత్‌లో ఉన్న పత్రికా స్వేచ్ఛ, బాధ్యతపై ఆందోళన



న్యూ ఢిల్లీ, మే 25: కేంద్ర సర్కారు మీడియా పట్ల తీవ్ర అసహనంతో వ్యవహరిస్తున్నదని, ఇది ఆందోళనకరమైన అంశమని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా పేర్కొన్నది. ఇటీవల యూరోప్ పర్యటనలో స్థానిక జర్నలిస్టులు ప్రధాని మోదీని ప్రశ్నించారు. కానీ ఆయన వారికి సమాధానం ఇవ్వలేదు. ఇక భారతీయ అధికారులు కూడా అక్కడ జర్నలిస్టులకు కౌంటర్ ఇచ్చే రీతిలో వ్యవహరించిన విషయం తెలిసిందే. నార్వే, నెదర్లాండ్స్ జర్నలిస్టులకు ప్రధాని మోదీ సమాధానం ఇవ్వకపోవడం పట్ల ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఆదివారం ఈ ఘటన పట్ల ఓ స్టేట్మెంట్ రిలీజ్ చేసింది. యురోపియన్ జర్నలిస్టులతో చోటుచేసుకున్న పరిణామాలు సిగ్గుచేటు ఘటన అని ఎడిటర్స్ గిల్డ్ అభిప్రాయపడింది. భారత్‌లో ఉన్న పత్రికా స్వేచ్ఛ, బాధ్యతపై ఆందోళన వ్యక్తం చేసింది. మీడియాను శత్రువుగా చూడడం మానుకోవాలని ఎడిటర్స్ గిల్డ్ తన ప్రకటనలో కోరింది. 2014 నుంచి దేశ ప్రధానిగా మోదీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, కానీ ఇన్నేళ్లలో ఆయన ఒక్కసారి కూడా ఓపెన్‌గా మీడియా సమావేశంలో పాల్గొనలేదని ఎడిటర్స్ గిల్డ్ తెలిపింది. ఇది విచారించదగ్గ అంశమని ఆ సంస్థ వెల్లడించింది. ఇటీవల నార్వే పర్యటనలో ప్రధాని మోదీని జర్నలిస్టు హెల్లి లింగ్ ఓ ప్రశ్నవేశారు. దానికి ఆయన సమాధానం ఇవ్వలేదు. దీంతో ఆ అంశం వివాదాస్పదమైంది.

# ఎబోలా ముప్పు.. ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించిన కేంద్రం

హైదరాబాద్, మే 25: ఎబోలా వైరస్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా తాజాగా ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇక ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి భారత్‌కు వచ్చే ప్రయాణికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు సూచనలు చేసింది. జ్వరం, వాంతులు, అకారణ రక్తస్రావం, తలనొప్పి, వంటి సమస్యలు తలెత్తిన వెంటనే ఎయిర్‌పోర్టు హెల్త్ ఆఫీసర్‌కు ఇమిగ్రేషన్ క్లియరెన్స్‌కు ముందే వెల్లడించాలని స్పష్టం చేసింది. ఎబోలా కేసులు అధికంగా ఉన్న డీఆర్‌సీ, ఉగాండా, దక్షిణ సుడాన్‌కు వెళ్లవద్దని కేంద్రం ఇప్పటికే భారతీయులకు సూచించింది. ఈ నేపథ్యంలో ఎయిర్ పోర్టుల్లో నిఘాను కట్టుదిట్టం చేశారు. లెబొరేటరీలు, క్వారంటైన్ వసతులను ఏర్పాటు చేస్తున్నారు.

మరోవైపు, ఆఫ్రికాలో ఇప్పటివరకూ 900లకు పైగా ఎబోలా అనుమానిత కేసులు వెలుగు చూశాయని డబ్ల్యూహెచ్ఓ తాజాగా వెల్లడించింది. 101 కేసుల్లో ఇప్పటికే వ్యాధి నిర్ధారణ అయ్యిందని వెల్లడించింది. ఇక యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ప్రకారం, ఎబోలా వ్యాప్తి ఎక్కువగా ఉన్న డీఆర్‌సీ దేశంలో 904 అనుమానిత కేసులు వెలుగులోకి రాగా 101 మంది రోగుల్లో ఎబోలా వ్యాధి నిర్ధారణ అయ్యింది. ఇప్పటికే 119 మంది ఎబోలా వల్లే మరణించినట్లు అనుమానాలు ఉన్నాయి. మరో 10 కేసుల్లో ఎబోలా వల్లే మరణాలు సంభించిందని కూడా పరీక్షల్లో తేలింది. మే 24 వరకూ ఉన్న వివరాల ప్రకారం, ఉగాండాలో 5 నిర్ధారిత కేసులు, ఒక ఎబోలా మరణం వెలుగులోకి వచ్చింది. ఆఫ్రికా దేశాల్లో జాతీయ స్థాయిలో ఎబోలా వ్యాప్తి చెందే రిస్క్ ఎక్కువగా ఉందని డబ్ల్యూహెచ్ఓ పేర్కొంది. ప్రపంచస్థాయి వ్యాప్తి ముప్పు కొంత తక్కువగా ఉందని పేర్కొంది.

# తాజ్ మహల్ చూసే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు : మార్కో రూబియో



హైదరాబాద్, మే 25: భారతదేశ పర్యటనలో భాగంగా మూడో రోజు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో సోమవారం ఆగ్రాలోని చారిత్రిక కట్టడం తాజ్ మహల్‌ను తన భార్య జీనెట్ రూబియోతో కలిసి చారిత్రాత్మక తాజ్ మహల్‌ను సందర్శించారు. ఆ కట్టడాన్ని ప్రపంచ సంపదలలో ఒకటిగా కొనియాడారు. వారు తాజ్ మహల్ వద్ద సుమారు గంటన్నర సేపు గడిపారు.

సందర్శకుల పుస్తకంలో "ప్రపంచపు నిజమైన సంపదల లో ఒకటైన తాజ్ మహల్‌ను సందర్శించేందుకు మాకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు" అని రాశారు.అ

ఈ పర్యటనలో భారతదేశంలో అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా వారితో పాటు ఉన్నారు.

కాగా, ప్రపంచం లోని ఏడు అద్భుతాలలో ఒకటైన తాజ్ మహల్ ఇండియాను సందర్శించే ఉన్నత స్థాయి ప్రపంచ నాయకులను, ప్రముఖులను నిత్యం ఆకర్షిస్తూనే ఉంది. గత సంవత్సరం, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషా వాన్స్, వారి పిల్లలు వివేక్, మిరాబెల్, ఇవాన్‌లతో కలిసి ఈ కట్టడాన్ని సందర్శించిన విషయం తెసిందే.

కాగా, మే 23 నుంచి మే 26 వరకు జరిగే ఈ పర్యటనలో మార్కో రూబియో భారత్ – అమెరికా ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వాణిజ్యం, ఇంధనం, రక్షణ, సహకారం, క్వాడ్ సమావేశాలపై భారత నాయకులతో చర్చలు జరపనున్నారు.

ఇంధన సరఫరాలు, వాణిజ్యం, రక్షణ రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశమని గతంలోనే ఆయన స్పష్టం చేశారు.

# కాశ్మీర్ గుల్మార్గ్‌లో ఆగిన కేబుల్ కార్ల సర్వీస్..ప్రయాణికులు సురక్షితం

ఉత్తర కశ్మీర్ మే 25: ఉత్తర కశ్మీర్‌లోని ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన గుల్మార్గ్‌లో సోమవారం భారీ ప్రమాదం తృటిలో తప్పింది. ఇక్కడి ప్రముఖ ఆకర్షణ అయిన 'గోండోలా కేబుల్ కార్' సర్వీస్‌లో అకస్మాత్తుగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో సుమారు 300 మంది పర్యాటకులు గాల్లోనే చిక్కుకుపోయారు. కేబుల్ కార్లు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో లోపల ఉన్న ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కొన్ని గంటలపాటు ప్రయాణికులు గాల్లోనే ఉండిపోవడంతో అక్కడ ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది.

కేబుల్ కార్లు గాల్లోనే నిలిచిపోవడంతో పర్యాటకులు.. గట్టిగా కేకలు వేశారు. గమనించిన స్థానికులు రక్షణ బలగాలకు సమాచారం అందించారు. కేబుల్ కార్ల నిర్వహణ వ్యవస్థలో సాంకేతిక సమస్య తలెత్తినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే ఇండియన్ ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ , ఎస్డీఆర్ఎఫ్ దళాలతో పాటు స్థానిక పోలీసులు రంగంలోకి దిగారు.

ఘటనపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. అధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించిన ఆయన.. సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. పర్యాటకులందరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడమే తమ మొదటి ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ప్రస్తుతం పోలీసులు, ఆర్మీ, సహాయక బృందాల సాయంతో పర్యాటకులను కేబుల్ కార్ల నుంచి సురక్షితంగా కిందకు దించుతున్నారు. మరోవైపు కేబుల్ కార్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఇంజనీర్లు పనులు ప్రారంభించగా.. అసలు ఈ సాంకేతిక లోపం తలెత్తడానికి గల కారణాలపై ఉన్నతాధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# హైదరాబాద్ మెట్రోకు భారీ ఆర్థిక రుణం.. ఐఆర్‌ఎఫ్‌సీతో కీలక ఒప్పందం

హైదరాబాద్, మే 25:హైదరాబాద్ మెట్రో రైలుకు భారీ ఆర్థిక ప్రయోజనం చేకూరింది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌తో (ఐఆర్ఎఫ్‌సీ) హైదరాబాద్ మెట్రో కీలక రీఫైనాన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. రూ.13,600 కోట్ల రుణ సదుపాయానికి సంబంధించిన ఈ ఒప్పందంపై ఈరోజు (సోమవారం) ఢిల్లీలో సంతకాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎఫ్‌సీ సీఎండీ మనోజ్ కుమార్ దూబే, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు సమక్షంలో ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తయింది. హైదరాబాద్ మెట్రోకు దీర్ఘకాలిక ఆర్థిక బలం చేకూర్చే కీలక అడుగుగా ఈ ఒప్పందాన్ని అధికారులు అభివర్ణించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పట్టణ రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎస్ రామకృష్ణరావు తెలిపారు. హైదరాబాద్ దేశ ఆర్థిక వృద్ధికి కీలక కేంద్రంగా ఎదుగుతోందని, మెట్రో కనెక్టివిటీ విస్తరణతో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం ప్రస్తుతం ఉన్న రుణాలను రీఫైనాన్స్ చేసేందుకు రూ.13,600 కోట్ల రుణం మంజూరు చేయనున్నారు. నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు, కమర్షియల్ పేపర్లు, వర్కింగ్ కాపిటల్ రీఫైనాన్సింగ్ కోసం ఈ నిధులను వినియోగించనున్నారు. 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక చెల్లింపుల విధానంలో ఈ రుణ సదుపాయం ఇవ్వనున్నారు.

రీఫైనాన్సింగ్ ద్వారా హైదరాబాద్ మెట్రోపై ఉన్న ఆర్థిక భారం తగ్గడమే కాకుండా, భవిష్యత్తులో విస్తరణ ప్రణాళికలకు కూడా ఆర్థిక వెసులుబాటు కలగనుంది. మరో కీలక పరిణామంగా, లార్సెన్ అండ్ టూబ్రో నుంచి ఎల్అండ్‌టీ మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్ వందశాతం యాజమాన్యం తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ కానుంది.

దీంతో హైదరాబాద్ మెట్రో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని ప్రధాన ప్రజా రవాణా ఆస్తిగా మారనుంది. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం, ఐఆర్ఎఫ్‌సీ, ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు బృందాలకు సీఎస్ రామకృష్ణరావు కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌కు సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎస్ స్పష్టం చేశారు.

# శక్తిమంతమైన 'సారీ'తో మానసిక ప్రశాంతత

## (26 మే "జాతీయ క్షమాపణ దినం" సందర్భంగా)

పొరపాట్లు చేయడం మానవ సహజం. నోరు జారడం నాలుక లక్షణం. అనుకోకుండానో, ఉద్దేశపూర్వకంగానో మనం కొన్ని చిన్న చిన్న తప్పులు చేయడం జరుగుతుంది. మనం చేసిన ఒక చర్య లేదా మన వదిలిన మాటల వల్ల మన మిత్రుల లేదా బంధువుల మనస్సు నొచ్చుకోవచ్చు, మానవ సంబంధాలు బలహీనపడవచ్చు. మన వల్ల జరిగిన పొరపాటుకు తక్షణమే క్షమాపణ తెలుపడంతో అపార్థాల మేఘాలు తొలగిపోయి మళ్లీ పూర్వపు ఆరోగ్యకరమైన సంబంధాలు కొనసాగుతాయి. క్షమాపణ చెప్పడం కూడా ఉత్తమ వ్యక్తిత్వంలో ఓ ప్రధాన కళ అవుతుంది. దీనినే 'క్షమాపణ తెలిపే కళ (ఆర్ట్ ఆఫ్ సేయింగ్ సారీ)'గా వర్ణిస్తారు. క్షమాపణ తెలుపడం అవమానకరం కాదు, అది ఆత్మన్యూనతకు దారి తీయకూడదు. క్షమాపణ చెప్పడం వల్ల మానసిక గాయాలు మానిపోతాయి. నమ్మకాలు/విశ్వాసాలు పెరుగుతాయి. మానసిక సంఘర్షణలు సమసిపోతాయి. మన ఆత్మవిశ్వాసాలు పెరుగుతాయి. భౌతిక దాడుల దారులు మూసుకుపోతాయి. పారదర్శకత చిక్కబడుతుంది. జవాబుదారీతనం పెరుగుతుంది. అపార్థాలతో అభిప్రాయ భేదాలు మొలిచి విడిపోయిన ఇరు పక్షాలను ఏకం చేసే ఉత్తమ సాధనం 'సారీ' చెప్పడమే.

జాతీయ క్షమాపణ దినం-2026 ఇతివృత్తం :

1998లో ఆస్ట్రేలియాలో ప్రారంభమైన "జాతీయ క్షమాపణ దినం" వెనుక ఓ చరిత్ర ఉన్నది. ఆస్ట్రేలియన్ ఆదివాసీ, స్వదేశీ గిరిజల తెగలకు జరిగిన అన్యాయాలను గుర్తించి తెలుసుకొని వారికి క్షమాపణలు తెలుపడానికి జాతీయ క్షమాపణ దినం వేదికలు ప్రారంభమైయ్యాయి. 2026 జాతీయ క్షమాపణ దినోత్సవ ఇతివృత్తంగా "క్షమాపణ నుంచి మానసిక స్వాంతన కూర్చే స్థాయికి ఎదగడం (ఫ్రమ్ సారీ టు ఆక్షన్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయటం జరుగుతోంది. నేటి వ్యక్తిత్వ వికాస పాఠాల్లో క్షమాపణ అడగడం, క్షమించే గుణాలను పెంచుకోవడం కూడా ఓ ప్రధాన కళ అని వర్ణించబడుతున్నది. "ఐ ఆమ్ సారీ" అనే మాటకు ఓ మహత్తర శక్తి ఉంటుంది. మనం కూడా అనుకోకుండా లేదా ఉద్దేశపూర్వకంగా మరొకరి మనసును నొప్పించి ఉండవచ్చని గమనించాలి. మాటల తూటాలకు వదిలి మనసులను గాయపరిచే మహత్తర శక్తి ఉంటుంది. ఒక్క మాట యుద్ధ వాతావరణాన్ని సృష్టించగలదు. దశాబ్దాలుగా ఒకటిగా ఉన్న వ్యక్తులను లేదా కుటుంబాలను ఓ అవాంఛనీయ మాట అడ్డుగోడలను కట్టగలదు. క్షమాపణ చెప్పడం వల్ల మనసు తేలికవుతుంది, ఆరోగ్యం కుదుటపడుతుంది, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. క్షమించడం వల్ల తిరిగి బలమైన మానవ సంబంధాలు, సామాజిక ఆరోగ్యాలు పునరుద్ధరించబడతాయి.

'సారీ' అనే మాట అతి శక్తివంతం :

క్షమాపణ తెలుపడం తప్పు చేసినట్లు కాదని, అనుకోకుండా చేసిన తప్పును సవరించుకునే ఓ అద్భుత అవకాశమని తెలుసుకోవాలి. క్షమించిన వారి కన్న క్షమాపణ కోరి వారికే ధైర్యం ఎక్కువగా ఉంటుందని గమనించాలి. క్షమాపణ చెప్పడం ఓ భావోద్వేగ సంఘర్షణ. క్షమాపణ చెప్పని యెడల జీవితాంతం తప్పు చేశామనే మానసిక క్షోభ మనల్ని వెధిస్తుంది, మనుషుల్ని/మనసుల్ని దూరం చేస్తుంది. ఒక్క 'సారీ' అనే మాట సకల విభేదాలను తుడిచేసి మళ్లీ ఆనందాల అనుబంధాలను కలుపుతుంది. ఒకరిని అపార్థం చేసుకోవడం, అవమాన పర్చడం, అసంబద్ధంగా మాట్లాడడం, అగౌరవ పర్చడం, మనం మాటపై నిలవకపోవడం, ఏక పక్ష తీర్పులు ఇవ్వడం లాంటివి మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తాయి. ఇలాంటి సందర్భాల్లో మన వల్ల పొరపాటు జరిగిందని గమనించి, ఆలస్యం చేయకుండా సారీ చెప్పడం వల్ల ఇరు పక్షాల మనసులు తేలిక పడతాయి, మానవ సంబంధాలు పూర్వపు స్థితికి వస్తాయి. క్షమాపణ చెప్పడానికి బదులుగా కుంటి సాకులు చెప్పడం అనే అలవాటు మంచిది కాదు.

భావోద్వేగ పరిపక్వత, సహానుభూతి, తప్పు చేసామని లేదా జరిగిందని అంగీకరించడం లాంటివి మనకు ఉండవలసిన ఉత్తమ లక్షణాలు. ఒక్క మాట విస్ఫోటనం కాగలదు, విభేదాల మంటలపై నీళ్లు చల్లగలదు. క్షమాపణ చెప్పడం అనేది ఓ నిజమైన కళ. ఇది కేవలం మాటలతో కాదు, మనసుతో, సహృదయంతో చెప్పే ఒక అద్భుత ప్రక్రియ. తప్పు చేసినపుడు క్షమాపణ చెప్పడం ఒక వ్యక్తి యొక్క సానుకూలతను, సమర్థతను తెలియజేస్తుంది. సారీ చెప్పడం ద్వారా సంబంధాలు బలోపేతం కావడం, అపార్థాలు తొలగిపోవడం, లోతైన ఆలోచనలకు అవకాశం దొరకడం, వ్యక్తిత్వం ఇనుమడించడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. సరైన సమయంలో క్షమాపణ తెలుపడం సిగ్గుచేటు కాదు, చిన్నతనం కూడా కాదు. అది మన ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం అని భావిస్తూ జీవనయానం కొనసాగిద్దాం, మానవ సంబంధాలను పెంచుకుంటూ సాగి పోదాం.



-మధుపాలీ
9949700037

# వికసిత్ భారత్ దిశగా సాగుతున్న పయనాన్ని వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న భారత యువత: ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, మే 25:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా 19వ రోజ్‌గార్ మేళా (ఉగ్యోగ మేళా)లో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సదస్సును ఉద్దేశించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వేలాది మంది యువతీ యువకులకు ఇది అత్యంత ముఖ్యమైన రోజు అని అభివర్ణించారు. ప్రభుత్వ సేవలోకి కొత్తగా అడుగుపెడుతున్న వారికి స్వాగతం పలుకుతూ.. రైల్వే, బ్యాంకింగ్, రక్షణ, ఆరోగ్యం, విద్య వంటి రంగాలతో సహా పలు రంగాల్లో దేశ అభివృద్ధికి వారు అందించబోయే కీలక సహకారాన్ని ప్రస్తావించారు. "రాబోయే సంవత్సరాల్లో వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేయడంలో మీరందరూ కీలక పాత్ర పోషిస్తారు" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఈ మైలురాయిని సాధించడానికి అభ్యర్థులు చూపిన అంకిత భావం, కఠోర సన్నాహాలను గౌరవిస్తూ.. వారందరికీ తన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏ ఒక్కరి వ్యక్తిగత విజయం ఒంటరిగా సాధ్యం కాదని గుర్తిస్తూ, ఈ సుదీర్ఘ ప్రయాణంలో వారికి ఎంతో అండగా నిలిచిన తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు కూడా ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇటీవలే ముగిసిన అయిదు దేశాల దౌత్య పర్యటనకు సంబంధించిన అనుభవాలను పంచుకుంటూ... డజన్ల కొద్దీ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థల అధినేతలు, దేశ యువత, మన సాంకేతిక పురోగతిపట్ల ఎంతో ఉత్సాహంగా ఉన్నారని ప్రధాన మంత్రి తెలిపారు. దేశ ఎదుగుదలలో భాగస్వాములు కావడానికి ప్రపంచం ఎంతగానో ఎదురుచూస్తోందని ఆయన వివరించారు. "భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో ప్రపంచం ఒక భాగం కావాలని కోరుకుంటోంది'' అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

తన పర్యటన దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక ఫలితాలను సవివరంగా వివరిస్తూ... తాము సందర్శించిన ప్రతి దేశంతో జరిగిన చర్చలు, కుదిరిన రంగాల వారీ ఒప్పందాలను ప్రధాన మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. నెదర్లాండ్స్‌తో సెమీకండక్టర్లు, నీరు, వ్యవసాయం, అధునాతన ఉత్పాదకత రంగాలపై చర్చలు, స్వీడన్‌తో కృత్రిమ మేధ, డిజిటల్ ఆవిష్కరణల రంగాల్లో సహకారంపై సంప్రదింపులు, నార్వేతో హరిత సాంకేతికత, నౌకా వాణిజ్య సహకారంపై చర్చలు, యూఏఈతో వ్యూహాత్మక ఇంధనం, సాంకేతిక భాగస్వామ్యాలపై అవగాహన ఒప్పందాలు, ఇటలీతో రక్షణ, కీలక ఖనిజాలు, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఒప్పందాలు జరిగాయని ప్రధానమంత్రి వివరించారు. భారత్ చేసుకునే అంతర్జాతీయ భాగస్వామ్యాలన్నీ కేవలం దేశ యువతకు లబ్ధి చేకూర్చేలా స్పష్టమైన ప్రణాళికతో రూపకల్పన జరిగాయని స్పష్టం చేశారు. "దేశ యువతకు ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ స్థాయి అనుభవం లభించడమే ఈ ఒప్పందాల ముఖ్య ఉద్దేశం" అని శ్రీ మోదీ చెప్పారు.

ఈ ప్రతి ఒక్క ఒప్పందానికి, ఉపాధి కల్పనకు ఉన్న ప్రత్యక్ష సంబంధాన్ని తెలియజేస్తూ... దేశంలోకి వచ్చే ప్రతి కొత్త పెట్టుబడి, ప్రతి సాంకేతిక భాగస్వామ్యం, ప్రతి పారిశ్రామిక సహకారం చివరికి దేశ యువతకు సరికొత్త అవకాశాలను సృష్టిస్తుందని ప్రధాన మంత్రి వెల్లడించారు. ఈ సహకారాలకు ఉన్న దీర్ఘకాలిక ప్రాధాన్యతను ఆయన మరింతగా వివరించారు. "రాబోయే 25 సంవత్సరాల పాటు ప్రపంచ వృద్ధిని శాసించబోయే పరిశ్రమలను నిర్దేశించే రంగాలు ఇవే" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

విశ్వసనీయమైన ప్రపంచ సరఫరా భాగస్వామిగా భారత్‌కు పెరుగుతున్న ప్రతిష్టకు నిదర్శనంగా ఏఎస్ఎంఎల్-టాటా ఎలక్ట్రానిక్స్ ఒప్పందాన్ని ప్రధాన మంత్రి ఒక ఉదాహరణగా పేర్కొన్నారు. డచ్ (నెదర్లాండ్స్)కు చెందిన ప్రముఖ సెమీకండక్టర్ దిగ్గజ సంస్థ ఎస్ఎంఎల్‌తో.. ఇలాంటి ఒప్పందం కుదుర్చుకున్న ప్రపంచంలోని అతికొద్ది దేశాల్లో భారత్ ఒకటి అని అన్నారు. కృత్రిమ మేధపై స్వీడన్‌తో కుదిరిన భాగస్వామ్యాలు, సూపర్ కంప్యూటింగ్‌పై యూఏఈతో ఏర్పడిన సహకారం కూడా ఇదే విధంగా దేశీయ సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేస్తాయని తెలిపారు. "ఈ ఒక్క ఏఎస్ఎంఎల్-టాటా ఎలక్ట్రానిక్స్ ఒప్పందం ద్వారానే భారత్‌లో వేలాది కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

స్వచ్ఛమైన ఇంధనం, కీలక ఖనిజాలు, హరిత హైడ్రోజన్, సుస్థిర తయారీ రంగాలు అపారమైన అవకాశాలు ఉన్న రంగాలుగా శరవేగంగా ఎదుగుతున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. పర్యావరణ హిత మార్పు, సుస్థిర సాంకేతికతలో స్వీడన్, నార్వే, ఇటలీ దేశాలతో పెరుగుతున్న సహకారం భవిష్యత్తులో పర్యావరణహిత తయారీ పరిశ్రమల్లో భారత్‌ను అత్యంత శక్తిమంతమైన స్థానంలో నిలబెడుతుందని ఆయన పేర్కొన్నారు. "ఈ భాగస్వామ్యాలు సరికొత్త ఆర్థిక వ్యవస్థకు, కొత్త అవకాశాలకు తలుపులు తెరుస్తున్నాయి" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఓడరేవులు, నౌకాయానం, నౌకా వాణిజ్య మౌలిక సదుపాయాల ఒప్పందాలపై వేగంగా జరుగుతున్న పనిని వివరిస్తూ... యూఏఈ, నార్వే దేశాలతో కుదిరిన భాగస్వామ్యాలు దేశీయ నౌకానిర్మాణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని ప్రధానమంత్రి తెలిపారు. ఇది దేశంలోని ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, నైపుణ్యం కలిగిన కార్మికులకు అవకాశాల పరిధిని నేరుగా విస్తరిస్తుందని పేర్కొన్నారు. 'దేశ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, నైపుణ్యం కలిగిన కార్మికులకు సరికొత్త అవకాశాలు లభిస్తాయి" అని ప్రధానమంత్రి శ్రీ మోదీ తెలిపారు.

ఈ ప్రతి కొత్త భాగస్వామ్యం భారతీయ అంకుర సంస్థలు, పరిశోధకులు, యువ నిపుణులకు అంతర్జాతీయ అనుసంధానాన్ని మరింత విస్తృతం చేస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వినూత్నంగా ఆలోచించే, సరికొత్తగా నిర్మించే, భారీ స్థాయిలో ఫలితాలను అందించే దేశాలను నేడు ప్రపంచం ఎంతగానో గౌరవిస్తోందని చెప్పారు. భారత్ ఈ మూడు రంగాలలోనూ దూసుకుపోతుండటం పట్ల ఆయన గర్వం వ్యక్తం చేశారు. "ఈ అద్భుతమైన మార్పు వెనుక ఉన్న అతిపెద్ద శక్తులు దేశ యువత... అంటే మీరందరే" అని శ్రీ మోదీ తెలిపారు.

ఈ అద్భుతమైన సందర్భాన్ని జాతీయ సమష్టి లక్ష్యంతో ముడిపెడుతూ... 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే దృఢ సంకల్పాన్ని ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఈ ప్రతిష్టాత్మక లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం వివిధ రంగాలలో చేపడుతున్న బహుముఖ పెట్టుబడుల వల్ల దేశంలో లక్షలాది కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని స్పష్టం చేశారు. "ఈ పెట్టుబడులు దేశ యువతకు లక్షలాది సరికొత్త ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి" అని శ్రీ మోదీ చెప్పారు.

దేశంలో వేగంగా విస్తరిస్తున్న సెమీకండక్టర్ వ్యవస్థ స్థాయిని ప్రధానమంత్రి వివరించారు. సెమీకండక్టర్ల తయారీకి అవసరమైన పూర్తిస్థాయి దేశీయ సరఫరా వ్యవస్థను ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే పది భారీ సెమీకండక్టర్ కేంద్రాలు ప్రపంచ వేదికపై తమవైన ముద్ర వేయబోతున్నాయని, ఇప్పటికే పెద్ద సంఖ్యలో భారతీయ యువతకు వీటిలో ఉపాధి లభిస్తోందని ఆయన తెలిపారు. " దేశ సెమీకండక్టర్ కేంద్రాలు ప్రపంచవ్యాప్తంగా తమదైన ముద్ర వేస్తాయి" అని ప్రధాన మంత్రి శ్రీ మోదీ ధీమా వ్యక్తం చేశారు.

సుమారు రూ. 75,000 కోట్ల భారీ పెట్టుబడితో భారత్‌లో విస్తరిస్తున్న నౌకానిర్మాణ, నౌకల మరమ్మతు, సమగ్ర మరమ్మత్తు వ్యవస్థపై దృష్టిసారిస్తూ.. .విమానాల నిర్వహణ, మరమత్తు సౌకర్యాలను కలిగిన పూర్తిస్థాయి ఎంఆర్ఓ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇది విమానయాన రంగాన్ని సమూలంగా మార్చివేస్తుందన్నారు. "దేశ యువత కోసం సరికొత్త ఉపాధి రంగం ఆవిష్కృతం కాబోతోంది" అని శ్రీ మోదీ తెలిపారు.

ప్రధాన ఎలక్ట్రానిక్స్ తయారీ దేశంగా భారత్ ఎదుగుతున్న తీరును వివరిస్తూ... రికార్డు స్థాయిలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి, లక్షలాది యువతకు ఉద్యోగాలను కల్పించడానికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ పథకం) కీలకంగా వ్యవహరిస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు దీనివల్ల ఎలక్ట్రానిక్స్ తయారీకి సంబంధించిన పూర్తి విలువ వ్యవస్థ దేశీయంగానే నిర్మితమవుతోందని పేర్కొన్నారు. "పీఎల్ఐ పథకం దేశంలో రికార్డు స్థాయిలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి దారితీస్తోంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండూ సంయుక్తంగా ఈ బహుళ కార్యక్రమాల్లో భారీ ఎత్తున పెట్టుబడులను పెడుతున్నాయని ప్రధాన మంత్రి వెల్లడించారు. వ్యాపారాలు, పరిశ్రమల పురోగతిని సులభతరం చేయడంలో తమకు ఉన్న బాధ్యతను కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. "వ్యాపార సౌలభ్యం దేశానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం"అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

ఉపాధి కల్పన, సమగ్ర వృద్ధిని నడిపించడంలో మౌలిక సదుపాయాలు ప్రాథమిక పాత్ర పోషిస్తాయని ప్రధానమంత్రి తెలిపారు. గ్రామాలు, చిన్న పట్టణాలు, మారుమూల ప్రాంతాలు దేశ అభివృద్ధి ముసాయిదాలో భాగమైనప్పుడు మాత్రమే జాతీయ ప్రగతి అసలైన ఫలాలు పూర్తి స్థాయిలో అందుతాయని చెప్పారు. "గ్రామాలు, మారుమూల ప్రాంతాలు అభివృద్ధితో అనుసంధానమైనప్పుడు దేశ ప్రగతి ప్రయోజనం మరింత ఎక్కువ మంది ప్రజలకు చేరుతుంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

గడిచిన పన్నెండేళ్ల కాలంలో రైల్వేలు, రహదారులు, విమానాశ్రయాలు, సరుకు రవాణా, ఓడరేవులు, డిజిటల్ నెట్‌వర్క్‌ల వ్యాప్తంగా నిర్మించిన విస్తృతమైన మౌలిక సదుపాయాల ప్రగతిని ప్రధానమంత్రి వివరించారు. ఈ అనుసంధానత రైతులకు, చిన్న వ్యాపారులకు, విద్యార్థులకు సమానంగా కొత్త మార్గాలను తెరిచిందని... ప్రస్తుతం ఈ మార్పు దేశంలోని గ్రామాలను సైతం స్పష్టంగా పునర్నిర్మిస్తోందని చెప్పారు. "గ్రామాల్లో సైతం మార్పు వేగంగా జరుగుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది'' అని వ్యాఖ్యానించారు.

కోట్లాది మంది భారతీయ కుటుంబాలకు అందుతున్న ప్రాథమిక వసతులైన శాశ్వత గృహాలు, వ్యక్తిగత మరుగుదొడ్లు, విద్యుత్, జల జీవన్ మిషన్ కింద అందుతున్న కుళాయి నీటి ద్వారా సమాజంపై పడుతున్న విస్తృత సానుకూల ప్రభావాన్ని ప్రధాన మంత్రి గుర్తుచేశారు. ఈ పునాది మార్పులు కేవలం సౌకర్యాల కల్పనకు మాత్రమే పరిమితం కాలేదని, అంతకుమించి ఎంతో ప్రభావం చూపాయని ఆయన పేర్కొన్నారు. "ఈ మార్పుల ప్రభావం కేవలం సౌకర్యాలకే పరిమితం కాలేదు" అని తెలిపారు.

గ్రామీణ రహదారులు, మెరుగైన విద్యుత్, డిజిటల్ అనుసంధానం వంటివి ఆర్థిక కార్యకలాపాలను రెట్టింపు చేయడానికి పనిచేస్తూ, మార్కెట్లకు సులభతరాన్ని కల్పించి, చిన్న తరహా పరిశ్రమలు వృద్ధి చెందడానికి దోహదపడి, గ్రామాలను కొత్త డిజిటల్ వ్యవస్థలలోకి తీసుకువచ్చాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ పరస్పర అనుసంధాన మెరుగుదలలు అన్నీ కలిసి దేశ ఆర్థిక వ్యవస్థను వేగవంతం చేశాయని, లక్షలాది కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించాయని ఆయన అన్నారు. "ఇవన్నీ ఉపాధి కల్పనపై సానుకూల ప్రభావాన్ని చూపాయి" అని పేర్కొన్నారు.

తయారీ రంగం, సాంకేతికత, అంకుర సంస్థలు, డిజిటల్ సేవలు, రైల్వేలు, రక్షణ, అంతరిక్ష రంగాల వ్యాప్తంగా నేడు దేశ యువతకు లభిస్తున్న అవకాశాలు దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేనివని ప్రధానమంత్రి ప్రకటించారు. గరిష్ట సంఖ్యలో యువత ఈ అవకాశాలను అందుపుచ్చుకునేలా, వారి ప్రతిభను పూర్తి స్థాయిలో ప్రదర్శించేలా చేయడంలో ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను ఆయన స్పష్టం చేశారు. "దేశ యువత తమ కలలను సాకారం చేసుకోవడానికి నేడు ఉన్నన్ని అవకాశాలు గతంలో ఎన్నడూ లేవు''అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ఐటీఐల ఆధునీకరణ, జాతీయ నైపుణ్య శిక్షణా సంస్థలను బలోపేతం చేయడం, పీఎం సేతు కార్యక్రమాన్ని ప్రారంభించడంతో సహా నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో ముడిపడిన విద్య, భవిష్యత్తు సాంకేతికతలపై ప్రభుత్వం నిరంతరం పెడుతున్న పెట్టుబడులను ప్రధానమంత్రి ప్రస్తావించారు. శరవేగంగా మారుతున్న ఆర్థిక వ్యవస్థ వేగానికి అనుగుణంగా నిరంతర సన్నద్ధత ప్రాధాన్యతను వివరించారు. "నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమలతో ముడిపడిన విద్య, భవిష్యత్తు సాంకేతికతలకు నిరంతర ప్రాధాన్యత ఇస్తున్నాం" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

దేశవ్యాప్తంగా స్వయం ఉపాధి, వ్యాపారవేత్తలుగా ఎదిగే సరికొత్త సంస్కృతి ఆవిర్భవించడాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు. 2.3 లక్షలకు పైగా గుర్తింపు పొందిన అంకుర సంస్థలతో భారత్ నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా ఎదిగిందని పేర్కొన్నారు.

# ఎన్డీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్



అమరావతి, మే 25:ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు విశేష స్పందన లభిస్తోంది.

సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను 39వ డివిజన్ జనసేన అధ్యక్షుడు ఏలూరు సాయి శరత్, 44వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావు, తెలుగు యువత నాయకులు దాడి మురళి, సెక్టార్-3 ఎన్ఐ వీ శివ, సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు.

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా సంబంధిత అధికారుల సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కూటమి నేతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చల్లం రాజు ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ముదిగొండ శివ, టీడీపీ నేత గూడెల ఉమామహేశ్వరరావు, సుజనా మిత్ర కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ



అమరావతి, మే 25:నరసరావుపేట శంకర భారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సంజన సింహ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, ప్రశ్నాపత్రాల పంపిణీ, భద్రతా ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణ విధానాన్ని ఆమె నిశితంగా పరిశీలించారు.

పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

# పాత స్నేహానికి నిలువెత్తు నిదర్శనం..!

అమరావతి, మే 25:తెలుగు సినీ దర్శకరత్న దాసరి నారాయణరావుకు సన్నిహిత మిత్రుడైన శనగశెట్టి సుబ్బారావుకు బుద్దా వెంకన్న మిత్ర బృందం రూ.25 వేల ఆర్థిక సహాయం అందజేసింది.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోని బావాజీపేటలో నివాసం ఉంటున్న శనగశెట్టి సుబ్బారావు, రాధా రంగా మిత్ర మండలి సభ్యుడిగా గుర్తింపు పొందారు. సినీ దర్శకరత్న దాసరి నారాయణరావుకు సన్నిహిత మిత్రుడిగా కూడా ఆయనకు పరిచయం ఉంది.

నరాలకు సంబంధించిన వ్యాధితో పక్షవాతం రావడంతో సుబ్బారావు ప్రస్తుతం మంచానికే పరిమితమయ్యారు. ఆయన ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న బుద్దా వెంకన్న స్పందించి, తన మిత్ర బృందం ఆధ్వర్యంలో రూ.25 వేల నగదును ఆర్థిక సహాయంగా అందజేశారు.

సుబ్బారావు నివాసానికి వెళ్లిన బుద్దా వెంకన్న మిత్ర బృంద సభ్యులు కళ్ళే నాగేశ్వరరావు, రాజనాల మాణిక్యాలరావు, కొప్పుల వెంకట్, చందన సురేష్ (మామ), యాసం చిట్టిబాబు సోమవారం ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగదును అందజేశారు.

సుబ్బారావు ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ మిత్రులు ధైర్యం చెప్పారు.

# ఎంఎస్ఎంఈ పార్కుతో కొత్త పారిశ్రామిక శకానికి శ్రీకారం



మచిలీపట్నం, మే 25:మచిలీపట్నంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు ద్వారా కొత్త పారిశ్రామిక శకానికి నాంది పలుకుతున్నామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

"నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు" కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం మచిలీపట్నం పోర్టుకు సమీపంలోని కరగ్రహారంలో మంత్రి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మచిలీపట్నం పోర్టుకు సమీపంలో సుమారు 20 నుంచి 21 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో దాదాపు 82 పారిశ్రామిక ప్లాట్లు ఏర్పాటు చేయనున్నామని, ఒక్కో ప్లాట్ 600 నుంచి 1000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉండనున్నట్లు వెల్లడించారు.

పార్కులో అవసరమైన అన్ని మౌలిక వసతులను ఎంఎస్ఎంఈ శాఖ ద్వారా అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. పోర్టు ఆధారిత సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు ఈ పార్కు కేంద్రంగా మారుతుందని తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు, ప్రభుత్వ రాయితీలు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. పోతేపల్లి ఆటోనగర్, గోల్డ్ కవరింగ్ ఇమిటేషన్ జ్యువెలరీ పార్కుల అభివృద్ధిని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అక్కడ వేలాది మందికి ఉపాధి లభిస్తోందని తెలిపారు.

2014-19 కాలంలో ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు భూసేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం వల్లే బందరు పోర్టు పనులు వేగవంతం అయ్యాయని గుర్తుచేశారు. అప్పట్లో భూసేకరణ కోసం దాదాపు రూ.200 కోట్ల నిధులు కేటాయించారని చెప్పారు.

2026 డిసెంబర్ లేదా 2027 జనవరి నాటికి బందరు పోర్టును ప్రారంభించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి వెల్లడించారు. పోర్టు ప్రారంభానికి ముందే పరిసర ప్రాంతాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 38 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే యువతకు శిక్షణ, బ్యాంకు రుణాలు, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

మచిలీపట్నంలో షిప్ బిల్డింగ్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని, ఇప్పటికే మూడు కంపెనీలు ఆసక్తి చూపినట్లు తెలిపారు. త్వరలోనే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుని పనులు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. షిప్ బిల్డింగ్ పరిశ్రమల ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

అక్రమ మట్టి తవ్వకాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని మంత్రి హెచ్చరించారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుక అక్రమ రవాణా చేస్తే యంత్రాలు, ట్రాక్టర్లను సీజ్ చేయడమే కాకుండా సహకరించే అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధితో మచిలీపట్నం రూపురేఖలు మారతాయి

జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

వ్యవసాయం, ఉద్యానవనం, ఆక్వాకల్చర్ కీలక రంగాలైనా, పరిశ్రమల అభివృద్ధి లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. పరిశ్రమలు ఏర్పడితే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం పెరిగి మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

మచిలీపట్నం నియోజకవర్గానికి పోర్టు ఉండటం ప్రత్యేకత అని, పోర్టు ఆధారిత పరిశ్రమలతో అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. పోర్టుకు ఆనుకుని 21 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో దాదాపు 83 పారిశ్రామిక ప్లాట్లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రభుత్వం "కౌశల్యం" కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకున్న యువతకు నైపుణ్య పరీక్షలు నిర్వహించి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

### మచిలీపట్నం అభివృద్ధికి ఎంఎస్ఎంఈ పార్కులు దోహదం

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, మచిలీపట్నం మహాదశ ప్రారంభమైందన్నారు. పోర్టు, రైల్వే లైన్, సమీప ఎయిర్‌పోర్ట్ వంటి మౌలిక సదుపాయాలతో నగరం వేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తోందని తెలిపారు.

ఎంఎస్ఎంఈ పార్కుల ద్వారా యువతకు విస్తృత స్థాయిలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఉద్యోగాల కోసం తిరిగే యువతే రేపు పరిశ్రమలు స్థాపించి మరికొందరికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ దీవెన్, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# భవ్య పథకం అమలుకు మార్గదర్శకాలను విడుదల చేసిన డీపీఐఐటీ

న్యూఢిల్లీ, మే 25: దేశవ్యాప్తంగా అంతర్జాతీయ ప్రమాణాలతో పెట్టుబడులకు సిద్ధంగా ఉండే పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన ప్రతిష్ఠాత్మక కేంద్ర పథకం - భవ్య - అమలుకు సంబంధించి భారత ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) సమగ్ర కార్యాచరణ మార్గదర్శకాలను విడుదల చేసింది.

మేక్ ఇన్ ఇండియా, పీఎం గతిశక్తి కార్యక్రమాల లక్ష్యాలకు అనుగుణంగా సమగ్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం ద్వారా భారత తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి భవ్య పథకాన్ని రూపొందించారు. భారత్ ను ప్రపంచస్థాయి పోటీ సామర్థ్యం కలిగిన తయారీ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ విస్తృత దృష్టికోణాన్ని ఇది ముందుకు తీసుకెళ్తుంది.

ఈ పథకం 2026-27 నుంచి 2031-32 మధ్య ఆరేళ్ల కాలంలో సుమారు రూ.33,660 కోట్ల రూపాయల వ్యయంతో 100 పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి అవకాశం కల్పిస్తుంది. మొదటి దశలో పోటీ ఆధారిత ఎంపిక ప్రక్రియ ద్వారా 50 పారిశ్రామిక పార్కుల వరకు ఎంపిక చేస్తారు.

పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన అర్హత ప్రమాణాలు, ప్రాజెక్టుల ఎంపిక విధానం, నిధుల సమీకరణ, పరిపాలనా వ్యవస్థ, పర్యవేక్షణ పద్ధతులు, అమలు విధానాల కోసం ఒక సమగ్రమైన ప్రణాళికను పొందుపరుస్తూ ఈ మార్గదర్శకాలు రూపొందించారు.

వెంటనే పని ప్రారంభించగల మౌలిక సదుపాయాలు, బహుళ రవాణా అనుసంధానం, నమ్మకమైన వినియోగ వ్యవస్థలు, కార్మికులకు సహాయక మౌలిక సదుపాయాలు, డిజిటల్ పరిపాలన విధానాలు, సుస్థిరమైన అభివృద్ధి లక్షణాలతో కూడిన పెట్టుబడులకు సిద్ధంగా ఉండే పారిశ్రామిక వ్యవస్థల సృష్టిపై ఈ పథకం ప్రధానంగా దృష్టి పెడుతుంది.

ఈ మార్గదర్శకాలు సరికొత్తగా నిర్మించే పారిశ్రామిక పార్కులతో పాటు అర్హత కలిగిన పాత పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి కూడా అవకాశం కల్పిస్తాయి. పర్వత ప్రాంతాలు లేని రాష్ట్రాలకు కనీసం వంద ఎకరాలు, పర్వత ప్రాంత రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, చిన్న రాష్ట్రాలకు ఇరవై ఐదు ఎకరాల కనీస భూమి అవసరమని నిర్దేశించారు. ఈ పథకం వెయ్యి ఎకరాల వరకు ఉండే పెద్ద పార్కులను పరిశీలించడానికి కూడా అనుమతిస్తుంది.

పోటీ ఆధారిత ఎంపిక విధానం కింద ప్రతిపాదనలను మౌలిక సదుపాయాల నాణ్యత, బహుముఖ రవాణా అనుసంధానం, స్థల అనుకూలత, పారిశ్రామిక వ్యవస్థ బలం, విధానపరమైన సౌలభ్య, డిజిటల్ నిర్వహణ సన్నద్ధత, దీర్ఘకాలిక స్థిరత్వం వంటి నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా మదింపు చేస్తారు.

ఈ మార్గదర్శకాలు భూగర్భ వినియోగ వ్యవస్థలు, నీటి వ్యర్థాల నిర్వహణ మౌలిక సదుపాయాలు, వ్యర్థ జలాల శుద్ధి వ్యవస్థలు, పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాలు, కార్మికుల వసతి గృహాలు, పరీక్షా ప్రయోగశాలలు, డిజిటల్ సింగిల్ విండో విధానాలు, నైపుణ్యాభివృద్ధి సౌకర్యాలు, సమన్వయ ఉమ్మడి మౌలిక సదుపాయాలు వంటి అంశాల నాణ్యత ఆధారంగా ప్రతిపాదనల అనుమతులకు అవకాశం కల్పిస్తాయి.

భవ్య పథకం కింద ప్రాజెక్టుల అమలును కంపెనీల చట్టం, 2013 కింద ఏర్పాటైన ప్రత్యేక ప్రయోజన సంస్థల (ఎస్పీవీ) ద్వారా చేపడతారు. ఈ ప్రత్యేక ప్రయోజన సంస్థలు ప్రాజెక్టు ప్రణాళిక, అభివృద్ధి, నిర్వహణ, పాలన, పెట్టుబడిదారుల సదుపాయాలు, ఈ పథకం కింద సృష్టించిన ఆస్తుల దీర్ఘకాలిక సంరక్షణకు బాధ్యత వహిస్తాయి.

ప్రత్యేక ప్రయోజన సంస్థకు బదిలీ చేసిన భూమి విలువ, నిర్దేశిత ప్రాజెక్టు పురోగతి ఆధారంగా ఈ పథకం ఈక్విటీ వాటా రూపంలో ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఈ పథకం అమలు, పర్యవేక్షణ కోసం జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ను ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (పీఎంఏ)గా నియమించారు.

పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో ప్రాజెక్ట్ సంబంధిత ఎస్పీవీల ద్వారా ప్రైవేట్ డెవలపర్ల భాగస్వామ్యం కోసం కూడా మార్గదర్శకాల్లో ప్రత్యేక నిబంధనలను చేర్చారు. వీటిలో స్పష్టంగా నిర్వచించిన పరిపాలనా వ్యవస్థలు, పారదర్శకతపరమైన రక్షణలు, జవాబుదారీతన యంత్రాంగాలు ఉంటాయి.

సమర్థవంతమైన అమలు, పారదర్శకత కోసం జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలు, క్రమబద్ధమైన పురోగతి నివేదికలు, ఆడిట్ విధానాలు, డీపీఐఐటీ కార్యదర్శి అధ్యక్షతన జాతీయ స్థాయి సారథ్య సంఘం పర్యవేక్షణను ఈ మార్గదర్శకాల్లో తప్పనిసరి చేశారు.

రవాణా, నైపుణ్యాభివృద్ధి, స్థిరత్వం, పునరుత్పాదక ఇంధనం, వినియోగ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి కోసం సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్యక్రమాలతో సమన్వయం సాధించడానికి ఈ మార్గదర్శకాలు మరింతగా వీలు కల్పిస్తాయి.

మార్గదర్శకాల విడుదల భవ్య పథకం అమలుకు, ప్రపంచ ప్రమాణాలకు సరితూగే పారిశ్రామిక మౌలిక సదుపాయాల సృష్టికి ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలుస్తుంది. ఇవి తయారీ రంగానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడానికి, దేశీయ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడానికి, ఉపాధి కల్పనకు, ప్రపంచ విలువ శ్రేణులతో భారత్ అనుసంధానాన్ని మెరుగుపరచడానికి దోహదపడతాయి.

# భవానీపురంలో మొదలైన కొత్త దిశ ఏంటి..




అమరావతి, మే 25:పారిశ్రామిక అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది.

ఫేజ్-3 కింద ఎన్టీఆర్ జిల్లాలోని భవానీపురం ఇండస్ట్రియల్ పార్క్‌లో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, స్థానిక డివిజన్ అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య, కామ దేవరాజు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అవసరమైన ఆధునిక మౌలిక వసతులు కల్పించడం ద్వారా స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని నాయకులు పేర్కొన్నారు.

ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుతో ఒకే ప్రాంగణంలో అనేక చిన్న పరిశ్రమలు కార్యకలాపాలు నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. దీంతో పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు పారిశ్రామికవేత్తలకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ రంగాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, పారిశ్రామిక పార్కుల ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు తెలిపారు.

# యూత్ డిక్లరేషన్ మోసాన్ని ఎండగట్టేందుకు 'చలో సరూర్‌నగర్' సభ : మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్, మే 25:అభయహస్తం కింద ఏవైతే డిక్లరేషన్ చేసిర్రో.. దాంట్లో ప్రధానమైంది 'యూత్ డిక్లరేషన్'. యూత్ అంటే మన రాష్ట్ర, దేశ భవిష్యత్. యూత్ డిక్లరేషన్ పేరిట నిరుద్యోగులకు ఎన్నో అలవికాని హామీలిచ్చి కాంగ్రెస్ సర్కార్ గద్దెనెక్కిందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు.

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తలసాని మాట్లాడుతూ.. యూత్ డిక్లరేషన్ పేరుతో అమరవీరుల త్యాగాలకు గుర్తింపుగా ప్రభుత్వ ఉద్యోగమని.. వారికి నెలనెలా పెన్షన్ అని ఒక కార్యక్రమం చెప్పారు.

రెండు లక్షల ఉద్యోగాలిస్తమన్నరు. గ్రూప్ 1 కానీ గ్రూప్ 2 కానీ జాబ్ క్యాలెండర్ ఇస్తరని చెప్పి రెండున్నర సంవత్సరాల నుంచి యువత అంతా ఎదురు చూస్తున్నారు.

కానీ గద్దెనెక్కిన నాటి నుండి విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మంగళం పాడుతూ కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగుల నోట్లో మట్టికొడుతుందన్నారు. అందుకే ఈ కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ మోసాన్ని ఎండగట్టేందుకు నిరుద్యోగ విద్యార్థులతో కలిసి త్వరలో 'చలో సరూర్‌నగర్' పేరిట భారీ సభ నిర్వహిస్తున్నామని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు.

# అప్పన్నవీడులో ప్రత్యేక దర్శనం వెనుక సందడి ..



ఏలూరు, మే 25:గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అప్పన్నవీడు (హనుమాన్ జంక్షన్)లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంను దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి నియోజకవర్గానికి ఘన స్వాగతం పలికారు.

శ్రీ అభయాంజనేయ స్వామివారికి పల్లా శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు వేద ఆశీర్వచనం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# విజన్-2030 కార్యాచరణ ప్రణాళిక, సంస్థాగత పనితీరు కొలమానాలను సమీక్షించిన ఏపీఓ పాలక మండలి

న్యూఢిల్లీ, మే 25:న్యూఢిల్లీలోని భారత మండపంలో మే 20 నుంచి 22 వరకు మూడు రోజుల పాటు సాగిన ఆసియా ఉత్పాదక సంస్థ (ఏపీఓ) పాలక మండలి 68వ సమావేశం ముగిసింది. విస్తృత చర్చలు, వ్యూహాత్మక ఆలోచనలు, ఉన్నత స్థాయి సమావేశాలతో విజయవంతంగా పూర్తయింది.

భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ఆధ్వర్యంలో జాతీయ ఉత్పాదకత మండలి (ఎన్‌పీసీ) ఈ సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్పాదకత సంస్థల (ఎన్‌పీఓల) అధిపతులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, విధాన నిర్ణేతలు, ఉత్పాదకత రంగానికి చెందిన నిపుణులు ఏపీఓ సభ్యదేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సభ్యదేశాల మధ్య ప్రాంతీయ సహకారాన్ని, సమన్వయాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో 20 మే 2026న సన్నాహక, రహస్య సమావేశాలతో ఈ మూడు రోజుల కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం నెట్‌వర్కింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

ప్లీనరీ సమావేశాల్లో ఏపీఓ భవిష్యత్తు దిశానిర్దేశం, పాలన, వ్యూహాత్మక ప్రాధాన్యతలకు సంబంధించిన పలు ముఖ్యమైన అజెండా అంశాలపై చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో సెక్రటరీ జనరల్ వార్షిక నివేదిక ఆమోదం, ఆర్థిక సంవత్సరం-2025 నివేదిక, ఆడిటర్ల నియామకం-2026, ఏపీఓ విజన్-2030 స్టీరింగ్ కమిటీ సిఫార్సులు, 2027-28 ద్వైవార్షిక కాలానికి సంబంధించిన ఏపీఓ ప్రాథమిక బడ్జెట్, పాలనా సంస్కరణలు, ప్రాంతీయ ఉత్పాదకత కార్యక్రమాల పురోగతి నివేదికలు, సంస్థాగత పనితీరును, నిబంధనల అమలును బలోపేతం చేయటం వంటి అంశాలున్నాయి.

మే 21, 2026న జరిగిన ప్రారంభ సమావేశానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ గౌరవ అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. భారతదేశ ఉత్పాదకత ఆధారిత వృద్ధి, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, తయారీ, రవాణా సంస్కరణలు, ఎంఎస్ఎంఈల సాధికారత, సుస్థిర చర్యలు, ప్రాంతీయ సహకారం వంటి కీలక అంశాలను ప్రముఖంగా ప్రస్తావించారు.

ఈ పాలక మండలి సమావేశం ముఖ్యమైన నాయకత్వ మార్పులకు కూడా వేదికగా నిలిచింది. 2026-27 సంవత్సరానికి గానూ ఏపీఓ చైర్మన్‌గా.. ఇండోనేషియా ఏపీఓ డైరెక్టర్ ప్రొఫెసర్ అన్వర్ సనూసి బాధ్యతలు చేపట్టారు. భారతదేశ ఏపీఓ డైరెక్టర్, భారత ప్రభుత్వ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) కార్యదర్శి శ్రీ అమర్‌దీప్ సింగ్ భాటియా నుంచి ప్రొఫెసర్ అన్వర్ సనూసి ఈ బాధ్యతలను స్వీకరించారు. ఇరాన్, జపాన్ దేశాల తాత్కాలిక ఏపీఓ డైరెక్టర్లు వరుసగా మొదటి, రెండో వైస్ చైర్మన్లుగా బాధ్యతలు చేపట్టారు.

ఉత్పాదకత పెంపుదల, సంస్థాగత నైపుణ్యానికి అందించిన విశేష కృషికి గుర్తింపుగా.. ఉత్పాదకత అడ్వకేట్లు, సాంకేతిక నిపుణుల కోసం ఏపీఓ అవార్డులు, ఎన్‌పీసీ ప్రత్యేక గుర్తింపు అవార్డుల ప్రధానోత్సవం ఈ కార్యక్రమంలోని ప్రధాన ఆకర్షణ.

ఏపీఓ సభ్య దేశాల్లో ఉత్పాదకత నిపుణుల ధ్రువీకరణ సంస్థలను అంచనా వేసేందుకు, వాటికి గుర్తింపు ఇచ్చేందుకు ఏపీఓ అక్రిడిటేషన్ సంస్థ (ఏపీఓ-ఏబీ)ని ఆసియా ఉత్పాదకత సంస్థ ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు భారత్‌తో సహా 13 ఏపీఓ సభ్య దేశాలు ఈ గుర్తింపును పొందాయి. ఈ కార్యక్రమం సందర్భంగా కంబోడియా జాతీయ ఉత్పాదకత సంస్థ ధ్రువీకరణ విభాగానికి ఏపీఓ-ఏబీ అక్రిడిటేషన్ పత్రాన్ని అందజేశారు.

పాలక మండలి సమావేశంలో ఏపీఓ విజన్-2030 లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు, డిజిటల్ పరివర్తన, సుస్థిరాభివృద్ధి, ఆవిష్కరణలు, సామర్థ్య పెంపుదల, ఉత్పాదకత ఆధారిత వృద్ధి వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకునేందుకు సభ్యదేశాలు ఉమ్మడి నిబద్ధతను స్పష్టం చేశాయి.

# ఆయుధాలను సొంతంగా తయారు చేసుకునే దేశం.. స్వయంగా గమ్యాన్ని నిర్దేశించుకుంటుంది: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, మే 25:"ఆయుధాలను సొంతంగా తయారు చేసుకునే దేశం.. స్వయంగా గమ్యాన్ని నిర్దేశించుకుంటుంది" అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మే 23, 2026న శిరిడీలో ప్రైవేటు రంగ సంస్థ నిబే గ్రూప్ ఏర్పాటు చేసిన రక్షణ రంగ ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా అత్యాధునిక ఫిరంగి వ్యవస్థలు, క్షిపణి, అంతరిక్ష సాంకేతికతలు, రాకెట్ వ్యవస్థలు, పేలుడు పదార్థాలు, స్వయం ప్రతిపత్తి గల రక్షణ వేదికలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా భారత్‌లో తొలిసారిగా 300 కి.మీ. పరిధి గల యూనివర్సల్ రాకెట్ లాంచింగ్ వ్యవస్థ 'సూర్యాస్త్ర'ను ప్రారంభించారు. ఈ వ్యవస్థకు సంబంధించి క్షిపణి కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేశీయ సాంకేతికతో రూపొందించిన టీఎన్‌టీ ప్లాంట్, ఆర్‌డీఎక్స్ ప్లాంట్, బయో ఎనర్జీ కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌లను కూడా ప్రారంభించారు. శాటిలైట్ అసెంబ్లీ రంగంలో సహకారానికి నిబే గ్రూప్, బ్లాక్ స్కై సంస్థల మధ్య ఎంఓయూ కుదిరింది.

ఆయుధ సామగ్రి ఉత్పత్తిలో స్వావలంబన ఆవశ్యకతను రక్షణ మంత్రి స్పష్టం చేశారు. ఈ కేంద్రం రక్షణ దళాల కార్యాచరణ అవసరాలను తీర్చటంలో సహాయపడుతుందని, దేశ పారిశ్రామిక వ్యవస్థను బలోపేతం చేయటానికి దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వ రంగ సంస్థలు, ఆయుధ కర్మాగారాలకే పరిమితమైన రక్షణ రంగాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం.. ప్రైవేటు రంగానికి అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. "భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చగల సామర్థ్యం ప్రైవేటు రంగానికి ఉందని మేం గుర్తించాం" అని ఆయన అన్నారు.

భవిష్యత్తులో యుద్ధ ఫలితాలను దేశ సైన్య పరిమాణం కాదు.. ఆయుధాలు, ఆటోమేషన్‌లో సాధించిన పురోగతి, సామర్థ్యాలే నిర్ణయిస్తాయని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "ప్రస్తుతం కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ సంఘర్షణలోనూ, పశ్చిమాసియా పరిస్థితుల్లోనూ ఈ వాస్తవాన్ని మనం గమనించవచ్చు. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఈ సామర్థ్యాన్ని భారత్ నిరూపించుకుంది" అని అన్నారు.

భవిష్యత్తులో జరిగే యుద్ధాల తీరుపై భారతదేశ ప్రైవేటు పరిశ్రమలకు పూర్తి అవగాహన ఉందని, దేశానికి అత్యాధునిక వ్యవస్థలను సమకూర్చేందుకు అవి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని రక్షణ మంత్రి తెలిపారు. ఆయుధాలు, ఆటోమేషన్ రంగాల్లో ప్రపంచ కేంద్రంగా భారత్‌ను మార్చేందుకు సంబంధిత వర్గాలన్నీ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కీలక సాంకేతికతలను, అధునాతన వ్యవస్థల్లో 'మేక్-ఇన్-ఇండియాను ప్రభుత్వం నిరంతరం ప్రోత్సహిస్తోందని ఆయన తెలిపారు. "ఆయుధాలు, ఆటోమేటెడ్ వ్యవస్థల్లో భారత్ అగ్రగామిగా నిలిచేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకునేందుకు మేం సిద్ధంగా ఉన్నాం" అని వెల్లడించారు.

సాంకేతికత ప్రాథమిక లక్ష్యం.. సైనికుల సామర్థ్యాలను తగ్గించటం కాదని, మరింత బలోపేతం చేయటమేనని, తుది నిర్ణయం ఎల్లప్పుడూ మానవ మేధస్సుకే ఉండాలని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. భవిష్యత్ యుద్ధాల్లో ఆధునిక ఆయుధాలు, ఆటోమేటెడ్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తాయని, ఈ దిశగా భారత్ పురోగమించటం తప్పనిసరని అన్నారు. "రక్షణ, అంతరిక్ష సాంకేతిక రంగాల్లో పూర్తి స్వావలంబన దేశంగా భారత్‌ను మార్చటానికి మనమంతా సమష్టిగా ప్రతిజ్ఞ చేద్దాం" అని పిలుపునిచ్చారు. భవిష్యత్ యుద్ధాల కోసం భారత్ సామర్థ్యాన్ని పెంపొందించాలని రక్షణ సంస్థలను కోరారు.

# యాతాలకుంట టన్నెల్ పనులపై మంత్రి తుమ్మల ఫోకస్



ఖమ్మం, మే 25: సత్తుపల్లి మండల పరిధిలోని యాతాలకుంట వద్ద కొనసాగుతున్న టన్నెల్ నిర్మాణ పనులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నిర్మాణంలో అనుసరిస్తున్న సాంకేతిక విధానాలపై వివరాలు కోరారు.

నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేసిన మంత్రి, ఆలస్యం జరిగితే ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. నిర్మాణ నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రతి దశను జాగ్రత్తగా అమలు చేయాలని సూచించారు. టన్నెల్ నిర్మాణం ప్రాంత అభివృద్ధికి కీలకమని అభిప్రాయపడ్డారు.

సాగునీటి సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం

యాతాలకుంట టన్నెల్ పూర్తయితే పరిసర ప్రాంతాల్లో సాగునీటి సదుపాయాలు గణనీయంగా మెరుగుపడతాయని మంత్రి తెలిపారు. రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని, వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతుల ఆర్థిక స్థితి బలోపేతం అవుతుందని వివరించారు. నీటి కొరత సమస్యలను తగ్గించేందుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని, రైతుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వేల ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు వివరించారు.

నాణ్యతపై రాజీ లేదన్న మంత్రి

టన్నెల్ పనుల పరిశీలన అనంతరం మంత్రి ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజాధనం వృథా కాకుండా బాధ్యతాయుతంగా పనులు చేపట్టాలని సూచించారు.

పనుల్లో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యతను పరిశీలించిన మంత్రి, అవసరమైన చోట ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

ప్రజా సమస్యలను ప్రస్తావించిన జారే ఆదినారాయణ

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జారే ఆదినారాయణ ప్రాంత ప్రజల సమస్యలను మంత్రికి వివరించారు. సాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధి కొనసాగుతోందని తెలిపారు.

రహదారులు, సాగునీటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, అభివృద్ధి పనులు పూర్తయితే ప్రాంతానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అధికారుల నివేదిక

మంత్రి పర్యటన సందర్భంగా జిల్లా అధికారులు టన్నెల్ నిర్మాణ పనులపై సమగ్ర నివేదిక సమర్పించారు. ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలు, మిగిలిన దశల కార్యాచరణ ప్రణాళికను వివరించారు.

నిర్మాణంలో ఎదురవుతున్న సాంకేతిక అంశాలను మంత్రికి తెలియజేస్తూ, పనులు వేగవంతం చేసేందుకు అదనపు యంత్రాంగాన్ని వినియోగిస్తున్నామని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనుల వేగాన్ని పెంచినట్లు వెల్లడించారు.

ప్రజల్లో ఆశాభావం

పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు, రైతులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించారు. టన్నెల్ నిర్మాణం పూర్తయితే సాగునీటి సదుపాయాలు మెరుగుపడి వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుందని రైతులు అభిప్రాయపడ్డారు.

ప్రజల సమస్యలను మంత్రి ఓపికగా విని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యాతాలకుంట టన్నెల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# వికసిత్ సిక్కిం 2047 దిశగా ఆ రాష్ట్ర ఘనమైన వారసత్వం, ప్రగతిని తెలియజేసే ఒక కథనాన్ని పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మే 25:సిక్కిం 51వ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా రాసిన ఒక కథనాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు పంచుకున్నారు.

సిక్కిం నేల, జ్ఞాపకాలు, చైతన్యానికి కాంచన్‌జంగా రక్షణగా ఉందన్న ప్రధాని.. ఈ కథనం దాని ప్రాధాన్యతను తెలియజేస్తోందని పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు

"సిక్కిం రాష్ట్రానికి 51 సంవత్సరాలు నిండిన సందర్భంగా కాంచన్‌జంగా గురించి కేంద్ర మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా ఒక వ్యాసం రాశారు. అది సిక్కిం నేల, జ్ఞాపకాలు, చైతన్యానికి రక్షకుడిగా ఉందని ఆయన కొనియాడారు.

కాంచన్‌జంగా పంచ నిధులు ఈ రాష్ట్ర ప్రగతి ప్రయాణాన్ని నిరంతరం నడిపిస్తూ 'వికసిత్ సిక్కిం 2047' సాధనకు మార్గం సుగమం చేస్తున్నాయని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు."

# ఎబోలా వ్యాప్తిని అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ

న్యూఢిల్లీ, మే 25:కాంగో డెమోక్రటిక్ రిపబ్లిక్ (డీఆర్‌సీ), ఉగాండా దేశాల్లో ఎబోలా వ్యాధి వ్యాప్తిని దృష్టిలో ఉంచుకొని అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనలు (ఐహెచ్ఆర్)-2005 ప్రకారం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్‌ఓ).. 2026 మే 17న ఈ పరిస్థితిని 'అంతర్జాతీయ ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా (పీహెచ్ఈఐసీ) ప్రకటించింది.

కాంగో డెమోక్రటిక్ రిపబ్లిక్, ఉగాండాలను అతలాకుతలం చేస్తున్న 'బుందిబుగ్యో' రకం ఎబోలా వైరస్ వ్యాప్తిని 'ఆఫ్రికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రం (ఆఫ్రికా సీడీసీ)' కూడా అధికారికంగా 'ఖండాంతర భద్రతకు ముప్పు కలిగించే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితి'గా (పీహెచ్ఈసీఎస్) ప్రకటించింది.

డబ్ల్యూహెచ్‌ఓ ఐహెచ్ఆర్ అత్యవసర కమిటీ 2026 మే 22న తాత్కాలిక సిఫార్సులను జారీ చేసింది. దీని ప్రకారం 'బుందిబుగ్యో వైరస్ వ్యాప్తి నమోదైన ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో నిర్ధారణ కాని జ్వరానికి సంబంధించిన లక్షణాలు ఉన్నవారిని గుర్తించడం, పరీక్షించడం, నివేదించడం, పర్యవేక్షించడం' కోసం సరిహద్దు ప్రవేశ కేంద్రాల వద్ద వ్యాధి నిఘాను బలోపేతం చేయాలని సూచించింది.

అదే సమయంలో ఈ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందిగా ప్రయాణికులను కోరింది.

డీఆర్‌సీ, ఉగాండా దేశాల సరిహద్దు ప్రాంతాలతో పాటు దక్షిణ సూడాన్‌ను కూడా ఈ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో చేర్చారు.

'బుందిబుగ్యో' రకం ఎబోలా వైరస్ వల్ల 'రక్తస్రావంతో కూడిన జ్వరం' (హెమరేజిక్ ఫీవర్) వస్తుంది.

ఇది అత్యధిక మరణాల రేటు కలిగి ఉన్న తీవ్రమైన వ్యాధి. ప్రస్తుతం బుందిబుగ్యో వైరస్ రకం వల్ల వచ్చే ఎబోలా వ్యాధిని నివారించడానికి లేదా చికిత్స చేయడానికి ఆమోదం పొందిన ఎలాంటి టీకాలు లేదా ప్రత్యేక చికిత్సా విధానాలు లేవు.

# వీబీ జీ రామ్ జీ చట్టం- 2025 అమలుకు సంబంధించి రాష్ట్రాల సంసిద్ధతపై సమీక్ష నిర్వహించిన గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి

న్యూ ఢిల్లీ, మే 25:వీబీ జీ రామ్ జీ చట్టం- 2025 అమలు, కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించడానికి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు చెందిన గ్రామీణాభివృద్ధి శాఖ (డీఓఆర్‌డీ) కార్యదర్శి శ్రీ రోహిత్ కాన్సల్ అధ్యక్షతన ఈ రోజు ఒక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు, రాష్ట్రాలు- కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నుంచి వీబీ జీ రామ్ జీ చట్టం పరిధిలోని ఫ్రేమ్‌వర్క్‌లోకి సజావుగా మారడానికి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు చేపడుతున్న ముందస్తు చర్యల పురోగతిని గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి సమీక్షించారు. ఈ చట్టం అమలు తర్వాత ఎటువంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగేలా చూసేందుకు అన్ని కీలకమైన ముందస్తు ఏర్పాట్లను నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించారు.

నూతన ఫ్రేమ్‌వర్క్ అమలుకు అవసరమైన వివిధ రాష్ట్ర స్థాయి ఏర్పాట్లు వంటి ముందస్తు చర్యలను ఈ సమావేశంలో భాగంగా సమీక్షించారు. వీటిలో రాష్ట్ర వీజీ జీ రామ్ జీ పథకం నోటిఫికేషన్ సిద్ధం చేయడం, ఈ చట్టం కింద రాష్ట్ర నిర్దిష్ట నిబంధనలను రూపొందించడం.. డీబీటీ- స్పర్శ్, ఎస్ఎన్ఏ-స్పర్శ్ కోసం సాంకేతిక అనుసంధానం చేయడం.. భాగస్వామ్య ప్రణాళికా విధానం ద్వారా గ్రామసభ ఆమోదించిన పనుల జాబితాను 'యుక్తధార' పోర్టల్ ద్వారా సిద్ధం చేయడం వంటి అంశాలతో పాటు ఇతర అవసరమైన ఆర్థిక, సాంకేతిక, పరిపాలనా ఏర్పాట్లు ఉన్నాయి. జూలై 1వ తేదీ నుంచి వీబీ జీ రామ్ జీ చట్టం అమలు చేసేందుకు అవసరమైన బడ్జెట్ నిబంధనలను రూపొందించుకోవాలని, తగిన ఆర్థిక కేటాయింపులను నిర్ధారించుకోవాలని కూడా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించారు. నూతన ఫ్రేమ్‌వర్క్‌లోకి సజావుగా మారడానికి వీలుగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను సకాలంలో చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు స్పష్టం చేశారు.

2026 జూలై 1 కంటే ముందే అన్ని ముందస్తు పనులను సకాలంలో పూర్తి చేయడానికి రాష్ట్రాలు- కేంద్రపాలిత ప్రాంతాలు, సాంకేతిక బృందాలతో సహా భాగస్వాములందరి మధ్య సన్నిహిత సమన్వయం ఉండాల్సిన అవసరాన్ని శ్రీ రోహిత్ కాన్సల్ ప్రముఖంగా ప్రస్తావించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నుంచి వీబీ జీ రామ్ జీ చట్టానికి మారడం అనేది గ్రామీణ ఉపాధి, జీవనోపాధి వ్యవస్థలో ఒక ప్రధాన సంస్కరణ అని.. అందువల్ల కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో సమన్వయ చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు.

వీబీ జీ రామ్ జీ చట్టం-2025 అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చేపట్టిన వివిధ ముందస్తు చర్యలను కూడా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు గ్రామీణాభివృద్ధి శాఖ (డీఓఆర్‌డీ) కార్యదర్శి తెలియజేశారు. ఈ నేపథ్యంలో వీబీ జీ రామ్ జీ కింద అనుమతించదగిన పనుల తాత్కాలిక జాబితాను అభిప్రాయాలు, సూచనల కోసం ఇప్పటికే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అందించారు. స్థానిక అవసరాల ఆధారంగా అదనపు పనులను ప్రతిపాదించాలని కూడా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరారు. వీటిని వీబీ జీ రామ్ జీ చట్టం-2025లోని షెడ్యూల్ ఎ కింద కేంద్ర ప్రభుత్వం పరిశీలించే అవకాశం ఉంది.

వీబీ జీ రామ్ జీ చట్టం-2025 కింద రూపొందించిన వివిధ ముసాయిదా నిబంధనలను 22.05.2026న విడుదల చేసినట్లు తెలిపిన మంత్రిత్వ శాఖ.. వాటిని తుది రూపంలోకి తీసుకురావడానికి ముందు 30 రోజుల పాటు విస్తృతంగా ప్రజా సంప్రదింపులు చేపట్టేందుకు ఈ-గెజిట్ లో ప్రచురించినట్లు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు తెలియజేసింది.

నూతన ఫ్రేమ్‌వర్క్ కింద ప్రణాళికలు, అమలును సులభతరం చేయడం కోసం గ్రామ పంచాయతీలను ఏ, బీ, సీ విభాగాలుగా వర్గీకరించే ఒక సూచనాత్మక ప్రణాళికను కూడా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అందించారు. నిర్దిష్ట స్థానిక అవసరాలు, నిబంధనల ఆధారంగా ఈ వర్గీకరణ కోసం తగిన ప్రమాణాలను అవి స్వీకరించొచ్చని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించారు.

సన్నద్ధతను సమీక్షించడానికి, అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి, అమలుకు సంబంధించిన సమస్యలపై సంప్రదింపులను సులభతరం చేయడానికి, కొత్త ఫ్రేమ్ వర్క్ లోకి సజావుగా మారేలా చూసేందుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో ప్రతి వారం క్రమం తప్పకుండా సంప్రదింపులు, సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

2026 జూలై 1న వీబీ జీ రామ్ జీ చట్టం అమల్లోకి వచ్చే వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద పనులు ఎటువంటి అడ్డంకులు లేకుండా కొనసాగించాలని శ్రీ రోహిత్ కాన్సల్ తెలియజేశారు. ఈ నేపథ్యంలో నిరంతరంగా ఉపాధి కల్పనను నిర్ధారించడానికి, మెరుగైన నూతన ఫ్రేమ్‌వర్క్‌లోకి సజావుగా మారడానికి వీలుగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అంచనా డిమాండ్ ఆధారంగా 2026 జూన్ నెలకు తగిన కార్మిక బడ్జెట్‌ను ఆమోదించారు.

ఈ మార్పు కాలంలో అంతరాయం లేని నిధులు లభించేలా చూసుకోవటంతో పాటు పనుల కొనసాగింపును నిర్ధారించడానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతనాలు, మెటీరియల్, పరిపాలన, సామాజిక ఆడిట్ యూనిట్ విభాగాల కొరకు రూ. 26,971 కోట్ల ప్రధాన నిధులను మంజూరు చేసినట్లు శ్రీ రోహిత్ కాన్సల్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి డిమాండ్‌ను తగిన విధంగా తీర్చడం కోసం నిధులను సద్వినియోగం చేసుకోవాలని, ప్రస్తుతం జరుగుతున్న పనులను సజావుగా పూర్తి చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించారు.

ముఖ్యంగా వ్యవసాయ పనులు లేని రోజుల్లో గ్రామీణ కుటుంబాలకు సకాలంలో ఉపాధి అవకాశాలను కల్పించడానికి క్షేత్రస్థాయిలో తగినన్ని పనులు ఉండేలా చూసుకోవాలని, ఉపాధి కోసం వచ్చే అన్ని వాస్తవ డిమాండ్ల విషయంలో పనులు కల్పించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించారు. గ్రామీణ కుటుంబాలకు సకాలంలో ఉపాధి అవకాశాలను అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కూడా సంబంధిత అధికారులను కోరారు. నూతన ఫ్రేమ్‌వర్క్ ప్రారంభమవటానికి ముందే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద ప్రస్తుతం కొనసాగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కూడా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు తెలియజేశారు. అయితే 2026 జూన్ 30 నాటికి పూర్తికాకుండా కొనసాగుతున్న పనులను వీబీ జీ రామ్ జీ నిబంధనలకు అనుగుణంగా ఉంచుతూనే ఆ చట్టం పరిధిలోకి బదిలీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మెరుగైన గ్రామీణ ఉపాధి, జీవనోపాధి ఫ్రేమ్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా సజావుగా అమలు చేయడానికి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో కలిసి పని చేయడానికి కేంద్ర మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని శ్రీ రోహిత్ కాన్సల్ పునరుద్ఘాటించారు.

# వినియోగదారులకు మరింత చేరువగా సేవలు



నల్గొండ, మే 25: స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందించడంలో కరీంనగర్ డైరీ ఎల్లప్పుడూ ముందుంటుందని కరీంనగర్ డైరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వర రావు అన్నారు.

సోమవారం మామడ మండలంలోని పొన్కల్ గ్రామంలో కరీంనగర్ డైరీ పార్లర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాణ్యమైన పాల ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మరింత చేరువ చేయడమే డైరీ లక్ష్యమని తెలిపారు. పాల ఉత్పత్తుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులకు ప్రయోజనం చేకూరేలా డైరీ సేవలను విస్తరిస్తున్నట్లు చెప్పారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ డైరీ చైర్మన్ చెలిమెడ రాజేశ్వరరావుతో పాటు జగిత్యాల మేనేజర్ లక్ష్మీపతి, సెల్స్ ఏజీఎం విష్ణు, సూపర్‌వైజర్లు రమేష్, చందు, పార్లర్ నిర్వాహకుడు సిలివేరి రాజన్న, నాయకులు చిట్యాల రాజారెడ్డి, కొంద్ర రాజారెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి..




నల్గొండ, మే 25: చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి పౌష్టికాహారం కీలకమని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్ అన్నారు. సోమవారం మండలంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ ఆడిటోరియంలో నిర్వహించిన అంగన్వాడి వంట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులకు అందిస్తున్న పోషకాహార భోజనాల తయారీ విధానాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహారం అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు.

అంగన్వాడి సిబ్బందితో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. మరిపెడ మండల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజలకు అవసరమైన సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడి టీచర్లు, సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం.. రోడ్డెక్కి రైతుల రాస్తారోకో

మెదక్, మే 25: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల పరిధిలోని ముంగాజిపల్లి ఎస్సీ కాలనీ రైతులు తమ వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ గజ్వేల్ - చేగుంట ప్రధాన రహదారిపై సోమవారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు.

అనంతరం రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. రాస్తారోకో కారణంగా రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న రాయపోలు ఎస్ఐ మానస అక్కడికి చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు.

# 'రోడ్డు, రేషన్ షాప్ సమస్యలు పరిష్కరించాలి'

## – ప్రజావాణిలో యాదాద్రి కలెక్టర్‌కు రావిపహాడ్ సర్పంచ్ వినతి

నల్గొండ, మే 25:: బీబీనగర్ మండలంలోని రావిపహాడ్ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ మేడబోయిన వెంకటేష్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తులు ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. మగ్దుంపల్లి నుండి రావిపహాడ్ తండా వరకు ఉన్న ప్రధాన రహదారి గత 16 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక గుంతలమయంగా మారిందని తెలిపారు. రహదారి అధ్వాన్నంగా ఉండడంతో ఆర్టీసీ బస్సు గ్రామానికి రావడం లేదని చెప్పారు. రావిపహాడ్, మాదారం గ్రామాలకు చెందిన సుమారు 40 నుండి 50 మంది విద్యార్థులు ప్రతిరోజూ విద్యాభ్యాసం కోసం ప్రయాణిస్తున్నారని, బస్సు సౌకర్యం లేక ఆటోలపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.80 వరకు ఖర్చవుతోందని, ఇది పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అత్యవసర సమయాల్లో అంబులెన్స్ రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

వెంటనే స్థల పరిశీలన చేసి సీసీ లేదా బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. అదేవిధంగా రావిపహాడ్, రావిపహాడ్ తండా ప్రస్తుతం వేర్వేరు గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పటికీ రేషన్ షాప్ మాత్రం తండాలోనే కొనసాగుతోందని తెలిపారు. దీంతో గ్రామ ప్రజలు




సుమారు 1.5 కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ రావిపహాడ్ గ్రామంలో కొత్త రేషన్ షాప్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బబిత బాల్‌రాజ్, రాసాల కమలమ్మ, మాజీ ఉప సర్పంచులు రాసాల శేఖర్, కొంతం భాస్కర్, కొసని వెంకటేష్, యంజాల బాల్‌రాజ్, గజ్జి మహేష్, కొసని సాయి, ఇంద్రియాల శివాజీ, మైలారం భరత్ పాల్గొన్నారు.

# తెలుగు కవిత్వంలో నిశ్శబ్ద స్వరం...ఇస్మాయిల్ కవిత్వం


మే 26...ఇస్మాయిల్ జయంతి

తెలుగు సాహిత్యంలో నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించిన కవి ఇస్మాయిల్. ఆయనది ఒక అద్భుతమైన వ్యక్తిత్వం. మహ్మద్ ఇస్మాయిల్ పూర్తి పేరుతో 1928 మే 26న నెల్లూరు జిల్లా కావలిలో జన్మించిన ఆయన, 2003 నవంబర్ 25న అనంతమైన నిశ్శబ్దంలోకి లీనమయ్యారు. కాకినాడ పి.ఆర్. కళాశాలలో తత్వశాస్త్రం లెక్చరర్‌గా, ఆ తర్వాత ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించి 1988లో పదవీ విరమణ చేశారు. ప్రభుత్వ అధికార భాషా సంఘంలో సభ్యునిగా కూడా కొంతకాలం పనిచేశారు.

ఇస్మాయిల్ వందలాది కవితా సంపుటాలను రాయలేదు గాని, తన రచనలతో తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసారు. ఆయన కవిత్వం పదాల కోసం పదాలు పెట్టడం కాదు; జీవితం, ప్రకృతి, మానవత్వం పట్ల లోతైన తాత్విక చింతన, సానుకూల దృక్పథం ప్రతిబింబించే విధంగా ఉంటుంది. సాధారణ విషయాలను, చిన్న చిన్న దృశ్యాలను, దైనందిన జీవితంలోని అనుభవాలను అద్భుతమైన పద చిత్రాలుగా మలిచే శక్తి ఇస్మాయిల్ కు మాత్రమే చెల్లింది.

ఆయన కవిత్వంలో ప్రత్యేకత ఏమిటంటే, అది నిశ్శబ్దంలోనూ విన్న వేదన, ఆనందం, కరుణ, సౌందర్యం. కవిత్వంలో వాదాలు, సుదీర్ఘ వాక్యాలు, క్లిష్టమైన పదజాలం ఉండవు. కేవలం ఒక చిన్న అనుభూతిని సున్నితమైన పద చిత్రాలుగా రేఖీకరించడం ద్వారా పాఠకుని మనసుకు అందిస్తారు. ఆయన కవితలు చదివిన పాఠకుడు ఒక్కసారిగా ఆ దృశ్యాన్ని తన కళ్లతో చూసినట్లు అనుభూతి చెందుతాడు. ఇస్మాయిల్ జపాన్ హైకూ కవిత్వాన్ని తెలుగు పాఠకులకు పరిచయం చేసిన వారిలో ప్రధానులు. ఈ పరిచయం ఆయన కవితల్లో చిన్నచిన్న చిత్రాలను సృష్టించ గలిగే సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసింది.

ఇస్మాయిల్ కవిత్వం ఒక విప్లవం. కానీ అది శబ్దాల విప్లవం కాదు. లోపల నిశ్శబ్దంగా కొనసాగే ఒక అనుభూతి విప్లవం. ఆయన కవితల్లో పదాలు కంటే వాటి వెనుక ఉన్న భావం, చింతన, ప్రకృతి, జీవితం పట్ల తాత్విక దృక్పథం ముఖ్యమైనవి. ఆయన "చెట్టు నా ఆదర్శం" అంటూ ప్రకృతి పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేశారు. "పిల్లలంత ఆనందంగా ఎందుకుంటారంటే వాళ్లు నిజమైన కవులు కాబట్టి. మనందరం పుట్టడం కవులుగానే పుడతాం" అన్న ఆయన మాటలు కవిత్వం పట్ల ఆయన వైఖరిని అద్భుతంగా వ్యక్తం చేస్తాయి.

ఇస్మాయిల్ ముఖ్య రచనలు... మృత్యువృక్షం, చెట్టు నా ఆదర్శం, రాత్రి వచ్చిన రహస్య వాన, కప్పల నిశ్శబ్దం, చిలుకలు వాలిన చెట్టు, పల్లెలో మా పాత ఇల్లు. ఆయన విమర్శా వ్యాసాలు కవిత్వంలో నిశ్శబ్దం, కరుణ ముఖ్యం ప్రత్యేక గుర్తింపును పొందాయి. మృత్యు వృక్షంకు ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, కవిత్వంలో నిశ్శబ్దంకు తెలుగు విశ్వవిద్యాలయం అవార్డు లభించాయి. కళాసాగర్ వారు ఆయనకు జీవిత సాఫల్య ఎఇస్మాయిల్ పదవులు, సన్మానాలకు దూరంగా ఉండేవారు. సాహిత్యాన్ని సామాజిక చైతన్యానికి పునాది చేయాలన్న ఆలోచనతో, ప్రకృతి, మానవ సంబంధాలను లోతుగా దర్శించిన తాత్విక కవి. ఆయన కవిత్వం కేవలం పదాల కూర్పు కాదు, అది జీవితాన్ని, మనుషుల అనుభూతులను, ప్రకృతిని ఒక కొత్త కోణంలో చూపించే అంతరాత్మ ఆవిష్కరణ. ఆయన నిశ్శబ్ద స్వరం తెలుగు సాహిత్యంలో ఒక ఎప్పటికీ నిలిచిపోయే ప్రభావాన్ని సృష్టించింది.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తాం: సీఎం చంద్రబాబు

అమరావతి, మే 25:రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ అని.. దీనిని అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమని ఉద్ఘాటించారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు.. మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుందని వివరించారు. సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థ, ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ తయారు కావాలని ఆకాంక్షించారు. ఈరోజు (సోమవారం) విజయవాడలో ఎంఎస్ఎంఈ గ్రోత్ సమ్మిట్ - 2026 జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరిట ఓ కళావేదికను ఇవాళ ప్రారంభించుకుని ఎంఎస్ఎంఈ సమ్మిట్ - 2026 నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 4.4 ఎకరాల్లో 1.45 చదరపు అడుగుల స్థలంలో ఈ కన్వెన్షన్ సెంటర్ నిర్మించామని తెలిపారు. ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. దేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఇదేనని చెప్పుకొచ్చారు. ఏపీలో వనరులు వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు.

**రూ.200 కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నాం..**

ఎంఎస్ఎంఈ పాలసీతో పాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తీసుకువచ్చామని సీఎం పేర్కొన్నారు. ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామిక యూనిట్‌లు, నిపుణులు, బ్యాంకులు ఒకే వేదికపైకి వచ్చాయని వివరించారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని సూచించారు. రూ.500 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు కూడా ఇప్పటికే విడుదల చేశామని చెప్పుకొచ్చారు. రూ.200 కోట్లతో క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నామని వివరించారు.

ప్రతీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇవాళ శంకుస్థాపన చేసిన 38 పార్కులతో పాటు వంద పార్కులకు ఇప్పటికే శంకుస్థాపన చేశామని ప్రస్తావించారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఈ పారిశ్రామిక పార్కులకు భూములు ఇచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు కూడా ఇన్సెంటివ్స్ ఇస్తామని స్పష్టం చేశారు. శ్రీసిటీ విజయవంతమైన పారిశ్రామిక పార్క్ అని చెప్పుకొచ్చారు. రూ.28 వేల కోట్ల కార్పస్ ఫండ్ డ్వాక్రా మహిళల సంఘాల వద్ద ఉందని తెలిపారు. ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా సంఘాల మహిళలను ఎంటర్ ప్రెన్యుర్లుగా మారుస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# భీమేశ్వర స్వామిని దర్శించుకున్న కల్వకుంట్ల హిమాన్షు




రాజన్న సిరిసిల్ల, 25: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనయుడు కల్వకుంట్ల హిమాన్షు వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కోడె మొక్కు చెల్లించుకుని ఆశీర్వాదాలు పొందారు.అనంతరం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి హిమాన్షుకి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.హిమాన్షు గారి ఆలయ దర్శనం సందర్భంగా ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, బి ఆర్ఎస్ నాయకులు నిమ్మ శెట్టి విజయ్, రాఘవ రెడ్డి, గోస్కుల రవి, కందుల క్రాంతి కుమార్, అంజద్ పాషా, తదితరులు పాల్గొన్నారు

# ఏఐఏడీఎంకేకు షాక్.. టీవీకేలో చేరనున్న ముగ్గురు రెబల్ ఎమ్మెల్యేలు

తమిళనాడు, మే 25: తమిళనాడులో ఎన్నికల తర్వాత కూడా రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. కలిసి పోటీ చేసిన కూటమి నుంచి పార్టీలు బయటకు వస్తున్నాయి. ఒక కూటమి పార్టీ మరో కూటమి పార్టీకి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. కొందరు ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ఏఐఏడీఎంకే పార్టీ ఎమ్మెల్యేలు ముగ్గురు ఆ పార్టీని వీడబోతున్నారు. అధికార టీవీకే పార్టీలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఎన్నికల ఫలితాల అనంతరం చాలా మంది ఏఐఏడీఎంకే పార్టీ ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ప్రకటించారు. అప్పట్లో తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేల్లో ముగ్గురు తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిశారు. అలాగే, మంత్రి ఆధవ్ అర్జునను కూడా కలిశారని తెలుస్తోంది. వీరంతా సీఎం విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే పార్టీలో చేరాలని భావిస్తున్నట్లు సమాచారం.

# ప్రజా సమస్యల పరిష్కారంలో సత్వర న్యాయమే లక్ష్యం



తిరుపతి, మే 25: ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యమని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు.

సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ స్వయంగా ఫిర్యాదుదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రతి ఫిర్యాదును ఓర్పుతో విని, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుదారులకు పరిష్కార మార్గాలను వివరించి ధైర్యం నింపారు.

ఈ కార్యక్రమంలో సుమారు 85 మంది ఫిర్యాదుదారులు వివిధ అంశాలపై వినతులు సమర్పించారు. అన్ని ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించి, ప్రాధాన్యత ఆధారంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పీజీఆర్ఎస్ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రావిమనోహరచారి, శ్రీనివాసులు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో ముగిసిన సమ్మర్ క్యాంప్



రాజన్న సిరిసిల్ల, 25: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం గత 15 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులు (సమ్మర్ క్యాంప్) సోమవారం నాటితో ఘనంగా ముగిశాయి. ఈ క్యాంప్‌లో విద్యార్థులకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, క్లాసికల్ డాన్స్, ఇండోర్ గేమ్స్, గణితంలో సులభమైన పద్ధతులపై నిపుణులతో ప్రత్యేక శిక్షణ అందించారు.?ఈ సందరభ్ంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారత్నం మాట్లాడుతూ విద్యార్థులు వేసవి కాలాన్ని వృధా చేయకుండా, తమలోని సృజనాత్మకతను మరియు నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇలాంటి శిక్షణా శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. 15 రోజుల పాటు క్రమశిక్షణతో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఉపయోగించుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయిఈ ముగింపు కార్యక్రమంలో ఉపాధ్యాయులు కట్ట రవీందర్, రాజు, క్రాఫ్ట్ టీచర్ స్వరూపలతో పాటు ఇతర శిక్షకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజెపి ఎస్. టి మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా గుగులోతు శ్రీకాంత్ నాయక్...



కరీంనగర్, 23:(నేటినిజం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ ఎస్ టి మోర్చా రాష్ట్ర కార్యదర్శి గా గుగులోతు శ్రీకాంత్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు బిజెపి రాష్ట్ర కార్యాలయం నియామకపు ఉత్తర్వుల ప్రకటన విడుదల చేసింది. ఈసందర్భంగా శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బిజెపి ఎస్టి మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా తిరిగి రెండోసారి బాధ్యతలు అప్పగించడానికి సహకరించిన కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు నేనావత్ రవి నాయక్, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగా డి కృష్ణారెడ్డి, రాష్ట్ర, జిల్లా కమిటీ నాయకులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. ఎస్టి మోర్చా బలోపేతానికి, బిజెపి విధానాలను, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పథకాలను గిరిజన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడానికి డానికి శాయ శక్తుల కృషి చేస్తానని శ్రీకాంత్ నాయక్ ఈ సందర్భంగా తెలిపారు.

# ఉమ్మడి స్థలం కబ్జా ప్రయత్నంపై రక్షణ కావాలి



అమరావతి, మే 25: తమకు సంబంధించిన ఉమ్మడి స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నారని, ఆ స్థలాన్ని రక్షించాలని సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ ఫిర్యాదు చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అనంత శ్రీరామ్ తన తండ్రి చేగొండి వీర వెంకట సత్యనారాయణతో కలిసి ఫిర్యాదు చేశారు. యలమంచిలి మండలం దొడ్డిపట్లలో తమ ఇంటి ముందు ఉన్న ఐదు సెంట్ల ఉమ్మడి స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు.

ఈ స్థలం వివాదం కోర్టులో ఉన్నప్పటికీ, బెదిరింపులకు పాల్పడి మానసికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వృత్తిరీత్యా తాను వేరే చోట నివసిస్తున్నప్పటికీ, స్థానికంగా ఉన్న తన తల్లిదండ్రులకు రక్షణ అవసరమని తెలిపారు.

గతంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని, ఆ రిజిస్ట్రేషన్ చెల్లదంటూ నరసాపురం కోర్టులో కేసు వేసినట్లు పేర్కొన్నారు. కోర్టులో కేసు కొనసాగుతుండగానే ఈ నెల 17న మళ్లీ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం జరిగిందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీకి ఇచ్చిన పీజీఆర్ఎస్‌లో కోరారు.

# పీజీఆర్ఎస్ అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలి

తిరుపతి, మే 25: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివ శంకర్ నాయక్, భరత్ నాయక్, రోజ్‌మాండ్‌లతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారులకు గౌరవప్రదంగా కూర్చునే సౌకర్యం, తాగునీరు, మెడికల్ క్యాంప్, గ్రామాల నుంచి వచ్చిన వారికి టీ సరఫరా వంటి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రజల సమస్యలను అధికారులు సావధానంగా విని అర్జీలు స్వీకరించారు.

పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మొత్తం అర్జీలలో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 246 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

సంగారెడ్డి, 25: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శించకుండా, నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంగీత ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 102 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 44, సంగారెడ్డి డివిజన్‌కు 17, ఆందోల్ డివిజన్‌కు 7, నారాయణఖేడ్ డివిజన్‌కు 16, జహీరాబాద్ డివిజన్‌కు 18 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com